# జీవనోపాయం



ఓ.విజయభాస్కర్

# జీవన్నాటకం

# (నాటకం)

✶ *ఈ నాటకం కన్నడ, తమిళం మరియు హిందీ భాషల్లోకి అనువదించబడినది.*

✶ *2002వ సంవత్సరం ప్రథమ ఉత్తమ రచనకు గాను నంది అవార్డుతో పాటుగా, ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ సహాయనటుడు, ఉత్తమ మేకప్ విభాగాల్లో నంది బహుమతులను సొంతం చేసుకుందీ నాటకం.*

## ఈ నాటకాన్ని మొట్టమొదట 2003 సం॥లో
## నంది నాటక పోటీల్లో ప్రదర్శించినవారు
## కళారాధన హైదరాబాద్

ఆ పోటీల్లో

**ద్వితీయ ఉత్తమ ప్రదర్శన**

**ఉత్తమ రచన**

**ఉత్తమ సహాయనటుడు**

**ఉత్తమ మేకప్**

నంది బహుమతులు పొందింది. నంది పోటీల్లోను ఆ తర్వాత ప్రదర్శనల్లోను పాల్గొన్న నటీనటవర్గం

| పాత్రలు | పాత్రధారులు |
|---|---|
| జగన్నాథం | **శ్రీ వై జితేంద్ర** |
| జగన్నాథం తండ్రి | **శ్రీ ఎస్. హనుమంతరావు/శ్రీ పద్మనాభం/ భానుప్రకాష్ / మాచూరి/ అమరేంద్ర** |
| గణపతి | **శ్రీ ఎమ్.ఎస్.కె. ప్రభు** |
| చలపతి | **శ్రీ పి. నాగేశ్వరరావు/ బి. అమరేంద్ర** |
| సూర్యప్రకాష్ | **శ్రీ బి.వి. హరి** |
| జగన్నాథం తల్లి | **శ్రీమతి పద్మప్రియ/శ్రీమతి జయశ్రీ/శ్రీమతి అనురాధ** |
| సుజాత | **/ శ్రీమతి సురభి ప్రభావతి** |
| పార్వతి | **శ్రీమతి రత్నకుమారి/శ్రీమతి జానకి / శ్రీమతి కళ్యాణి / శ్రీమతి సుజాత** |
| రాజ్యం | **కుమారి శ్రీదేవి/కుమారి అనురాధ/శ్రీమతి శాంతి /శ్రీమతి ప్రభావతి** |
| జంతువులు | **శ్రీ చందు/మల్లాది రమేష్** |
| | **శ్రీ గణేష్** |
| | **శ్రీ రాంప్రసాద్/నరేంద్ర** |
| భగవంతుని స్వరం | **శ్రీ బి. అమరేంద్ర** |
| ఆహార్యం | **ప్రొ॥ శ్రీ అంజిబాబు/శ్రీ హరిశ్చంద్ర/బి.వి.రావు/కుమార్** |
| సంగీతం | **శ్రీ రాజబాబు/శ్రీ సైదారావు** |
| సెట్ అండ్ లైటింగ్ | **శ్రీ నాయుడు/శ్రీ నర్సింగరావు / శ్రీ సురభి బాబ్జీ/మల్లాది రమణ/గాంధీ** |
| దర్శకత్వం | **శ్రీ బి. భానుప్రకాష్** |

# జీవన్నాటకం

## మొదటి రంగం

(తెర లేచేసరికి రంగస్థలమంతా చిక్కని చీకటి అలుముకుని ఉంది. అంతటా నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలోంచి ఎన్నో జంతువుల హాహాకారాలు, అరుపులు వినిపిస్తున్నాయి. కాస్సేపటికి ఓ ఏనుగు రంగస్థలంపైకి వచ్చి –)

**గజరాజు :** ప్రభూ! దేవ దేవా! ఈ భూమండలం మీదున్న సకల జీవరాశులు మీ దర్శనం కోసం వచ్చాయి. కనికరించి కనిపించు ప్రభూ! దర్శనాన్ని ప్రసాదించు దేవా! (రంగస్థలంపై ఒక దివ్యతేజస్సు గోచరమైంది. ఆ తేజస్సు సృష్టికర్త అయిన భగవానునిది)

**భగ :** గజరాజా! ఏమిటా కోలాహలం!

**గజ :** ప్రభూ! అనంతకోటి జీవరాశులు వాటి వాటి గోడును వినిపించాలని వచ్చాయి ప్రభూ!

**భగ :** ఈ గ్రహరాశుల్నీ, నక్షత్ర మండలాన్ని, అష్టదిక్కుల్ని, శబ్ద, స్పర్శ, రూప రసగంధ సమన్వితాలైన పంచభూతాలనీ వారికోసమే కదా సృష్టించాను. వాళ్ళ ఆనందంకోసం సంగీత, సాహిత్య, నాట్య, శిల్ప, కళా, విలాసాల్ని ఆవిష్కరించాను. వారి తృప్తికోసమే నవరసాల్ని పొందుపరచాను. ప్రకృతిని సకల ప్రయోజనకారిగా తీర్చిదిద్ది వారిసేవకోసం వినియోగించాను. వీటన్నింటినీ సమంగా అనుభవిస్తూ, కాలాన్ని ఆనందంగా వెళ్ళదీయకుండా ఇంతలో ఏం జరిగిందని ఇలా హృదయ విదారకంగా ఆర్తనాదాలు చేస్తున్నారు.

**గజ :** ప్రభూ! మానవులకు, కోతులకు, కుక్కలకు, గాడిదలకు మాలాంటి మరికొన్ని చతుష్పాదులకు నలుబది సంవత్సరాలు ఆయువుగా నిర్ణయించి అంతకాలం తప్పనిసరిగా బ్రతకమని ఆజ్ఞాపించారు.

**భగ :** అవును! ఆ ఆజ్ఞపై ఇప్పుడొచ్చిన సందేహమేమి?

**గజ :** అది వారిద్వారానే వింటేనే బాగుంటుంది ప్రభూ....

**భగ :** అయితే కొందరిని మాత్రమే ముఖ్యులను రమ్మని చెప్పు.

(గజరాజు సైగచేయగా గాడిద – కుక్క – కోతి వచ్చాయి.)

**గజ :** ప్రభూ! నాకులాగానే వీటికి కూడా వాక్కును ప్రసాదించండి! వాళ్ళ ఘోషను వినిపిస్తారు.

**భగ :** తథాస్తు.

గజ : గార్ధభ రాజమా! మీ వినతి ఏమిటో! ప్రభువుకి విన్నవించండి.

గార్ధ : ప్రభూ! తమరి ఆజ్ఞ ప్రకారమే నిండు నలభై సంవత్సరాలు బ్రతకాలనుకున్నాను. కానీ! కొన్ని స్వార్ధజీవుల కుయుక్తులవలన అంతకాలం జీవించుట దుర్లభమని తేలిపోయినది.

భగ : ఎవరా స్వార్థ జీవులు – ఏమా కుయుక్తులు

గార్ధ : మీకు గుడులుకట్టి నిత్యం పూజిస్తున్నవారే ప్రభూ!

శున : ప్రభూ! జీవులన్నింటినీ తమరు సమభావంతో సృష్టించారు. కానీ జరుగుతున్నది అదికాదు ప్రభూ!

భగ : మరేమి జరుగుతున్నది శునకశ్రేష్ఠమా?

మర్క : ఏం జరుగుతోందో నన్ను చెప్పమంటారా ప్రభూ!

భగ : చెప్పండి మర్కటాగ్రేసరా!

మర్క : మానవులు ప్రకృతి మొత్తాన్ని తమ గుప్పిటలో పెట్టుకున్నారు. వీరి దౌష్ట్యానికి, దుర్మార్గానికి అంతులేకుండా పోతున్నది. వీరి స్వార్ధానికి కొన్ని జీవజాతులు ఉనికిని కోల్పోయాయి. మరికొన్ని తెగలు అంతంత మాత్రంగా మిగిలి ఉన్నాయి. మరికొన్నింటిని బంధించి బానిసలుగా చేసుకొని తమ గుప్పిటలో పెట్టుకున్నారు.

భగ : ఎంత దుర్మార్గం! గజరాజా! మానవుడ్ని పిలిపించండి. (గజరాజు సంజ్ఞ చేసాడు – మానవుడు వచ్చాడు) ఏం? మానవా? వీళ్ళు చెప్తున్నది నిజమా? స్వార్థం కోసం వీళ్ళను బానిసలుగా ఉపయోగించుకుంటున్నావట.

మాన : నిజమే!

భగ : ఎంత నిర్భయంగా చెప్తున్నావు.

మాన : ఇది నా ఆత్మ విశ్వాసం...

భగ : ఏం చూసుకొని!

మాన : నా మేధస్సుని.

భగ : నా సంకల్పబలం కన్నా, సృష్టిస్థితిలయ విన్యాసంకన్నా ఘటనాఘటన సమర్థతకన్నా గొప్పదా నీ మేధస్సు. అయినా దాన్ని నీకు ప్రసాదించింది మేమే కదా.

మాన : (నవ్వి) అత్త పెద్దరికం కోడలు ఊరునుంచి వచ్చేవరకేనట. అలాగే ఈ సృష్టిపై దేవుని అజమాయిషీ కూడా మానవుడ్ని సృష్టించినవరకే.

భగ : అంటే! ఏమిటి నీ ఉద్దేశం.

**మాన:** దేవా! వీరెవరికీ లేని తెలివినాకిచ్చావు. తెలివితోపాటు జిజ్ఞాస, పట్టుదల, నేర్పరితనం వంటపట్టించుకున్నాను. వీటన్నిటి సాయంతో, ఇదిగో ఈ జీవులన్నింటిమీద పట్టు సాధించాను. ఏ జంతువు ఎలా పనికివస్తుందో అలా వినియోగించుకుంటున్నాను. ఇందులో తప్పేముంది?

**గార్ధ :** చూసారా ప్రభూ! మీతోనే ఎలా మాట్లాడుతున్నాడో! ఈ దైవ ద్రోహికి చాకిరీచేస్తూ ఇంకా బతకాలని లేదు... తక్షణమే నాకు మరణాన్ని ప్రసాదించండి..

**శున :** నన్ను కూడా ఈ మానవుని చెరనుండి విముక్తిని ప్రసాదించండి ప్రభూ!

**మర్క:** నన్నూ మీలో ఐక్యం చేసుకోండి దేవా!

(భగవంతుడు ఆలోచనలోపడ్డాడు ఒక్కక్షణం).

**భగ :** జీవులారా! మీ వేదన నాకర్థమైంది. కానీ నేను నిర్ణయించిన ఆయుః ప్రమాణం ప్రకారం మీరు నలభైసంవత్సరాలు జీవించాల్సిందే ఒక్కరోజు కూడా తగ్గించేందుకు వీలులేదు... అది సృష్టి ధర్మం... సృష్టిధర్మాన్ని ఏ దేవుడు అతిక్రమించలేడు.

**మర్క:** మా కోరిక సమంజసమైనది కాదా తండ్రీ!

**శున :** ఇష్టంలేని జీవితం పరిసమాప్తం చేసుకోవటం నేరమా దేవా?

**గార్ధ :** ఇంకా ఇరవై సంవత్సరాలు ఈ మనిషికి చాకిరీ చేయడం నావల్లగాదు ప్రభూ!

**గజ :** వీరి కష్టాలకు తరుణోపాయం లేదా ప్రభూ?

**భగ :** ఉంది. ఒకే ఒక ఉపాయముంది.

**గార్ధ :** ఏమిటిది ప్రభూ!

**భగ :** మీ మిగిలిన ఆయుష్షు వేరొకప్రాణి తీసుకుంటే తప్ప మీకు మరణాన్ని ప్రసాదించలేను....

**మర్క:** అయితే ఇప్పుడు మాకు దిక్కెవరు?

**శున :** మమ్మల్ని రక్షించే వారెవరూ లేరా?

**భగ :** సకల ప్రాణులారా! ఈ మూడు ప్రాణుల దుఃఖాన్ని మీరందరూ చూశారు. వారికొచ్చిన కష్టాలు విన్నారు. వీరి ముగ్గురిదీ కలసి ఇంకా అరవై సంవత్సరాల ఆయుష్షు మిగిలివుంది. మీలో కొంతమంది ముందుకువచ్చి వీరి ఆయుష్షులో

ఒక్కరోజు చొప్పున తీసుకున్నా వీళ్ళకి తక్షణం మరణాన్ని ప్రసాదిస్తాను. వీరు అనుభవిస్తున్న బాధలనుండీ విముక్తి కలిగిస్తాను... అందుకు ఎవరైనా సిద్ధపడితే! ముందుకు రండి! (ఎవరూ మాట్లాడలేదు) ఏం?... ఎవరూ సిద్ధంగా లేరా!

**గజ :** అందరూ మానవుడిని చూసి భయపడుతున్నట్లుంది ప్రభూ!

**మాన:** (బిగ్గరగా నవ్వాడు) చూశావా దేవా!.... ప్రతి కష్టంలోనూ ఒక అవకాశాన్ని వెదికే ఆశాజీవి మనిషొక్కడే... నువ్వు నవగ్రహాల్ని సృష్టిస్తే నేను వాటిని అధిగమించే దారుల్ని నిర్మించాను. నువ్వు సముద్రాన్ని సృష్టిస్తే నేను నావను కనిపెట్టాను. నువ్వు నింగిని కల్పిస్తే నేను విమానాన్ని నిర్మించాను. నీ సృష్టికి ప్రతిసృష్టి చేయగల సత్తా నా ఒక్కడికేవుంది! కాబట్టి ఈ గాడిదది, ఆ కుక్కది, ఆ కోతిది ఆ ముగ్గిరి ఆయుష్షు నేను తీసుకుంటాను.

**భగ :** నువ్వా!

**మాన:** నేనే! ఏం? .... ఆశ్చర్యంగా వుందా దేవా!

**భగ :** అంత ఆయుష్షు ఏం చేస్తావు నాయనా!

**మాన:** ఇపుడున్న నలభైఏళ్ళూ సరిపోవడం లేదు నాకు! చదువు సంధ్యలు పూర్తి చేసుకొని నాలుగురాళ్ళు సంపాదించుకునే సరికే జీవితం తీరుపోతుంది. కాబట్టి ఇంకా అరవై ఏళ్ళు ఇచ్చావనుకో... పిల్లాపాపలతో, మనవలతో, కూడేసిన ఆస్తిపాస్తుల్ని ఖర్చుపెట్టుకుంటూ హాయిగా అనుభవిస్తాను. ఏం ఇస్తావా! అనుభవిస్తాను....

**భగ :** తథాస్తు... గాడిద, కుక్క, కోతి ఆయుష్షు మొత్తం పోసుకొని అనుభవించు.

**మాన:** ధన్యుడ్ని దేవా.... ధన్యుడ్ని. (నమస్కరించాడు. అందరివంకా చూసి నవ్వుతూ వెళ్ళిపోయాడు)

**భగ :** సకల ప్రాణులారా! ఇక మీరు వెళ్ళండి. మీమీ ఆయుష్షులని మిగతా మానవులంతా పంచుకుటారు.

**భగ :** ఏం గజరాజా ఆలోచనలో పడ్డావు.

**గజ :** గొప్ప పొరపాటు చేశారు ప్రభూ....

**భగ :** ఏమది?

**గజ :** నలభై ఏళ్ళ ఆయుష్షు ఉన్నప్పుడే మిగిలిన జీవులమీద అంత ఆధిపత్యం చేసిన వాడికి పూర్ణాయుష్షు వందేళ్ళు ప్రసాదించారు. ఇపుడింకా విజృంభించి సృష్టిని నాశనం చేయడా! మిగిలిన జీవుల్ని బతకనిస్తాడా ప్రభూ! చేసిన తప్పులకు మానవుణ్ణి శిక్షిస్తారేమో అనుకుంటే – వరాన్ని ప్రసాదించారు –

**భగ :** వరంకాదు గజరాజా! ఏ జంతువు ఆయుష్షును మానవుడు ఆశగా, ఆబగా కోరుకున్నాడో, ఆయా కాలాల్లో ఆ జంతువులాగానే బతుకుతాడు. ఆ జీవి అనుభవించిన యాతన, వేదన స్వయంగా అనుభవిస్తాడు. మిగిలిన జంతువుల్ని గుప్పిట్లో పెట్టుకున్నందుకు, ప్రకృతిని ఇతర జీవరాసుల్ని నాశనం చేస్తున్నందుకు, నేను మనిషికి విధించిన శిక్ష అది, ఇస్తున్న శాపం అది!

**గజ :** అదెలా ప్రభూ?....

**భగ :** చూడాలనివుందా? అయితే నువ్వూ మానవ జీవితాన్ని పొంది నా శాప మహిమను చూడు.

**గజ :** కానీ ప్రభూ! మానవునిగా పుట్టినపుడు ఈ శిక్ష నాకూ వర్తిస్తుందిగా!

**భగ :** ఆ భయం నీకక్కర్లేదు. ఏ బాదరబందీ లేకుండా ఎప్పటికీ నువ్వు నలభైఏళ్ళ వాడిగానే వుండిపోయి ఆ జీవన్నాటకం కనులారా వీక్షించు గజరాజా! ఆ వరాన్ని నీకు ప్రసాదిస్తున్నాను.

(గజరాజు భగవంతుడికి నమస్కరించుచుండగా)

(Lights off)

# రెండవ రంగం

(కనిపించేది జగన్నాథరావు ఇల్లు – జగన్నాథం వయసు నలభై పైచిలుకు. అతని భార్య పార్వతమ్మ లోపలినుంచీ బయటికి వచ్చి గుమ్మందాకా వెళ్ళి ఎదురుచూసి మళ్ళీలోపలికి వెళ్ళబోతుండగా జగన్నాథం తల్లి, చెల్లెలు రాజ్యం లోపలినుంచీ ఎదురయ్యారు – ఆమె వంక నిరసనగా చూశారు. ఆమె తల వంచుకొని లోపలికి వెళ్ళింది – వాళ్ళిద్దరూ గుమ్మంవైపు వెళ్ళిచూస్తున్నారు. ఈలోగా జగన్నాథం తండ్రి పెరట్లోంచి వచ్చాడు)

**తండ్రి** : వీడింకా రాలేదేమిటి?

**తల్లి** : ఏదీ! ఇంతవరకూ అంతులేడు....

**తండ్రి** : ఆ ఏముందీ... మామూలేగా వాడికోసం మనం ఎలాగూ చచ్చినట్లు ఎదురు చూస్తామని తెలుసుగా వెధవకి... మురిపిస్తుంటాడు... వస్తాడులే...

**తల్లి** : నిజమే.. ప్రతినెలా ఫస్ట్ తారీఖునాడు ఈ భాగోతం మనకు అలవాటేగా! అవ్వవడికింది తాతమొలతాడికి సరిపోయిందని, ఏదో లక్షలు లక్షలు తెచ్చి మనచేతిలో పడేస్తున్నట్లు నలుగురూ అనుకోవడం... (భార్య బియ్యం చేటతో వచ్చింది – ఆమెను చూస్తూ అన్నది) వాడేమో ముష్టి పడేసినట్లు ఎంతో కొంత పడేయటం ఆ మాత్రం భాగ్యానికి మనం కళ్ళుకాయలు కాసినట్లు ఎదురుచూడటం... వెధవ బతుకు వెధవ బతుకని.

**తండ్రి** : వెధవ బ్రతుకు కాదే – కుక్కబతుకు. ఈవిడగారు ఎప్పుడూ వండి వడ్డిస్తుందాని ఎదురుచూడాలి. వాడెప్పుడు వచ్చి నాలుగు రూపాయలు దులిపేస్తాడాని ఎదురుచూడాలి. ఇది కుక్క బతుకుకాదూ!

**పార్వ** : ఎందుకండీ అలా నోరుపారేసుకుంటారు... ఈ ఇంటికోసం ఆయనెంత కష్టపడుతున్నారో ఎలా రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారో మీకు తెలీదా!

**తండ్రి** : మేమెంత రెక్కలు ముక్కలు చేసుకొనివుంటే నీమొగుడింత వాడైవుంటాడు. అమ్మా నాన్నలకు ముద్దపడేయడం ఊరికి ఉపకారం చేసినట్లుగాదు.

**తల్లి** : చిన్నప్పుడు అన్నం తినడానికి, పెద్దయ్యాక అన్నం పెట్టడానికి తల్లిదండ్రుల్ని ఏడిపిస్తుంటారు పిల్లలు. వీడేం బాగుపడతాడులేఁ?

**పార్వ** : ఎందుకండీ ఆయన్నలా ఆడిపోసుకుంటారు. ఇప్పుడాయన ఏంచేసాడని.

**రాజ్య** : అన్నయ్య మీద ఈగవాలనీయదమ్మా వదిన! (మూతివిరుస్తూ)

**తల్లి** : అంటే ఈవిడగారి కంటికి మనం ఈగల్లా దోమల్లా కనబడుతున్నామన్నమాట.

**పార్వ** : (కంగారుగా నొచ్చుకుంటూ) అయ్యయ్యో! నేను అలా అనలేదండీ.

**తండ్రి** : ఎలా అన్నా నీ ఉద్దేశ్యం మాకు అర్థమైందిలేమ్మా...

**తల్లి** : దాన్నోట్లో నోరుపెట్టకే తల్లీ.... మొగుడికి ఎక్కించేసినా ఎక్కించేయగలదు.

**తండ్రి** : పెళ్ళాంమాటకు తాళంవేసే ఆడారి వెధవ! వాడితో దేంజరేనే.....

**పార్వ** : ఇప్పుడు నేనేమన్నానండీ... ఆయన పడుతున్న శ్రమను కొంచెమైనా గుర్తించండి అంటున్నాను.

**తల్లి** : బలేపడ్తున్నాడులే శ్రమ. ప్రపంచంలో నీ మొగుడుతప్ప ఇంకెవరు పడుతున్నారు.

**తండ్రి** : మీ అన్నయ్య కష్టార్జితం మనకివ్వడం మీవదినకు ఇష్టంలేనట్లుందే అమ్మా అందుకే అంతగా వెనకేసుకొస్తోంది.

**తల్లి** : మనం గుడికి వెళ్ళినప్పుడు మొత్తం ప్రసాదమంతా మూలవిరాట్టుకు పెట్టేసి మిగిలినది – చిల్లర దేవుళ్ళ ముందు చేతులు దులిపేస్తాంకదా!

**రాజ్య** : అవును.

**తల్లి** : అలాగే సంపాదించినంతా పెళ్ళాం ఒడిలో పడేసి మనకు మాత్రం ఏదో ఇంత రాల్చేస్తాడు. మరి అలాంటపుడు మొగుడ్ని ఆమాత్రం వెనకేసుకొని రాకపోతే ఎలా!

**పార్వ** : ఎందుకత్తయ్యా అలాంటి మాటలంటారు! ఆయన నాకు భర్తయితే మీకు కొడుకుకాదా!

**తల్లి** : ఆ! కొడుకే! కొరగాని కొడుకని.

**తండ్రి** : కొడుకుగా మాకేం చేస్తున్నాడమ్మా ఆవెధవ... అరె! తల్లిదండ్రులు ముసలివాళ్ళయ్యారు బతికినన్నాళ్ళు బతకరే అని బదిరీనాథ్, కేదార్‌నాథ్ వరకూ అక్కర్లేదు. కాశీ, రామేశ్వరం తిప్పక్కర్లేదు. కనీసం తిరుపతి కాళహస్తికూడా దిక్కులేకపోతే ఎలా! ఇలాంటి కొడుకు ఉంటే ఎంత ఊడితే ఎంత?

**పార్వ** : మామయ్యగారూ!

**తల్లి** : ఏం? ఎందుకలా గొంతుచించుకుంటావు... ఆయనన్నదాంట్లో తప్పేముంది.

**పార్వ** : కన్నకొడుకు గురించి అలాగేనా మాట్లాడేది?

**తల్లి** : మాబాగా చెప్పావు... ఆలికి లోకువైనవాడు అవనికి లోకువనీ...! వాడు చేసిందానికి నేన్నది చెల్లు... మధ్య నువ్వేంటట.

**పార్వ** : (కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ) ఎన్ని అంటారో అనండి... నా ఖర్మ... ఆయన ప్రారబ్ధం.

**రాజ్య** : కదిపితేచాలు కళ్ళు నీళ్ళకుండలే... (మూతివిరిచింది. బయటనుంచి జగన్నాథం భయం భయంగా అడుగుపెట్టాడు.)

**తండ్రి** : అడుగో వచ్చాడు వంశోద్ధారకుడు... ఏవిట్రా దొంగలాగా నక్కి నక్కి

వస్తున్నావ్. కొంపదీసి ఎక్కడన్నా కన్నంవేసి రాలేదుకదా....

(జగన్నాథం మాట్లాడకుండా గుమ్మంవేపు చూస్తూ వున్నాడు భయంగా.)

**తల్లి** : ఏమిట్రా! ఏమైంది.... ఆ చెమటలేమిటి?... (లోపలివైపు తిరిగి) ఇదిగో మీ ఆయనొచ్చాడు. కాసిన్ని మంచినీళ్ళన్నా తెచ్చి తగలెయ్... అబ్బబ్బ... అన్నీ చూసుకోలేక ఛస్తున్నాను... (భార్య మంచినీళ్ళ గ్లాసుతో వచ్చింది... జగన్నాథం అందుకొని గటగట తాగేశాడు.)

**పార్వ** : ఏమిటండీ అలావున్నారేంటి!

**తల్లి** : ఇంట్లో అడుగుపెట్టగానే ఏమిటాప్రశ్నలు... మగాడు ఇంటికిరాగానే ఇలా ఆరాలు తీయడం మా ఇంటావంటాలేదమ్మా...

**తండ్రి** : మనం ఎక్కడ ముందు మాట్లాడేస్తామో... మనకేం ఇచ్చేస్తాడోనని ఈవిడగారి భయం. (జగన్నాథం కుర్చీలో కూలబడ్డాడు....)

**తండ్రి** : ఏమైందిరా అంటే మాట్లాడవేం.....

**జగ** : (తలవంచుకుని) అప్పులవాళ్ళని తప్పించుకొని వచ్చేసరికి ప్రాణంపోయినంత పనైంది.

**పార్వ** : ఏమండీ!

**జగ** : పిల్లల చదువుకోసం తీసుకున్న అప్పు ఇప్పుడు తడిసి మోపెడైంది. అసలు కాకపోయినా వడ్డీ అయినా ఇమ్మని కూర్చుంటున్నాడు ఆ శేఠ్....

**తల్లి** : పిల్లల చదువుకు అప్పుచేయడమేవిట్రా... వాళ్ళు మీ బావగారింట్లో వుండి చదూకుంటున్నారుగా

**పార్వ** : ఎంత మా అన్నయ్య ఇంట్లో వుండి చదువుకుంటున్నా వాళ్ళ ఫీజులు, పుస్తకాలు, బట్టలూ ఇవన్నీ కూడా మా అన్నయ్యనే భరించమనడం బావుండదుకదత్తయ్య.

**తండ్రి** : ఆ మాత్రం దానికి అక్కడుంచి చదివించడం దేనికట.

**తల్లి** : మా పుట్టింటి వాళ్ళు కాబట్టి నా పిల్లల్ని చదివిస్తున్నారని గొప్పలు చెప్పుకోడానికా!

**తండ్రి** : అయినా బిడ్డల చదువుకోసం అప్పుచేయని తల్లిదండ్రులెవరుంటార్రా... అదో పెద్ద నేరం అయినట్లు బాధపడ్తే ఎలా!

**జగ** : నాకున్న అప్పు అదొక్కటే కాదు నాన్నా... పండగలకు, పబ్బాలకు, తిథులకు తద్దినాలకు చేబదుళ్ళు ఇచ్చిన వాళ్ళంతా తిరిగి ఇమ్మంటున్నారు. ఇంటి ఓనరు, పాలవాడు, కిరాణాకొట్టువాడు – ఇలా ప్రతివాడూ ఈ రోజు నన్ను పట్టుకోవాలని ఎదురు చూస్తుంటారు... వాళ్ళందర్నీ తప్పించుకుని దొంగలాగ

పెంట కుప్పలమీంచి, మురికి కాల్వలమీంచి ముసుగేసుకుని తప్పించుకుని వచ్చాను.

**తండ్రి** : అంటే ఇప్పుడేమంటావ్!... మాకిచ్చేనెలవారీ ఖర్చులు ఎగ్గొట్టేస్తానంటావా?

**తల్లి** : అదేం మాటండీ. వాడంత బుద్ధిలేనివాడా! ... తల్లిదండ్రుల నోట్లో మట్టిగొడ్తే పుట్టగతులుండవని వాడికిమాత్రం తెలీదటండీ.

(జగన్నాథం భార్యవంక చూసాడు – ఆమె జాలిగా అతన్ని చూసింది)

**పార్వ** : మొహం కడుక్కురండి. టిఫిన్ తిందురుగానీ...

(జగన్నాథం లేచి లోపలికి వెళ్ళబోయాడు.)

**తల్లి** : తీసుకెళ్ళమ్మా తీసుకెళ్ళు! దగ్గర కూర్చుని గోరుముద్దలు తినిపించి... జీతమంతా లాగేసుకో! ఆ తర్వాత మిగిలిన చిల్లర శవాలమీద విసిరేసినట్లు ఈముసలి జీవచ్ఛావాలమీద పడేయించు... ఇదిగో మమ్మల్ని ఇంత ఉసురు పెట్టిస్తున్నావ్... నువ్వేం బాగుపడిపోవ్!

**పార్వ** : ఏమిటండీ ఈ శాపనార్థాలు... మనిషి వచ్చీరాగానే డబ్బుగొడవ తప్ప ఆయన మంచీ చెడ్డా పట్టించుకోనక్కర్లేదా!

**జగ** : నువ్వాగు పార్వతీ!.... మీకివ్వాల్సిన డబ్బుగురించేగా నాన్నా!.... ఇదిగో నీకివ్వాల్సింది... ఇదిగోమ్మా ఇదినీది... రాజ్యం ఇది నీ ఖర్చులకి... (జేబులోంచి డబ్బుతీసిచ్చాడు)

**రాజ్య** : (లెక్కపెట్టుకుంటూ)... అన్నయ్యా ఈనెల మీ బావ వెయ్యిరూపాయలు అడిగి ఇప్పించుకోమన్నారు.

**జగ** : వెయ్యి రూపాయలా!! (చలపతి వచ్చాడు)

**చల** : అవును. అక్షరాలా వెయ్యి రూపాయలే!

**జగ** : అంతడబ్బు ఏంచేస్తావయ్యా?

**చల** : ఏంటీ! బోడి వెయ్యి రూపాయలకు నీకు లెక్కలు చెప్పాలా? వెయ్యి రూపాయలు ఒక లెక్కా – తొక్కా.

**జగ** : ఏమిటి బావా తూలుతున్నావ్!

**చల** : వాగుతున్నాను కూడా!

**జగ** : ఏమిటిది వాసనొస్తోంది.

**చల** : (నవ్వాడు) తాగొచ్చాను కద.

**జగ** : ఏంటీ! తాగొచ్చావా!...

**చల** : ఈడెవడండీబాబూ! తాగొచ్చానయ్యా మొగుడా అంటే తాగొచ్చావా?

తాగొచ్చావా అని గుచ్చి గుచ్చి అడుగుతాడు... తాగే వచ్చాను వచ్చి తాగలేదు. దటీజ్ ద డిఫరెన్స్ – అండర్‌స్టాండ్! అయినా రోజూ చేస్తున్నపనే... కాకపోతే యివ్వాళ నీకు దొరికిపోయానంతే.

**జగ** : నీకు బుద్ధుందా అసలు... ఈ ఇంటికి శనిగ్రహంలాగా పట్టుకున్నావు.... అదిసరిపోలేదని తాగుడుకూడానా?

**చల** : అవును తాగుతాను.. ఇంకా మాట్లాడితే మరొకర్ని తెచ్చుకుని ఇదిగో ఇక్కడ... ఈ నట్టింట్లో కాపురం పెడతాను.. ఏం చేస్తావ్?.... ఏం చేస్తావ్... (మీది మీదికి వచ్చాడు)

**జగ** : నరికిపోగులుపెడతాను (ఫట్‌మని కొట్టాడు. చలపతి కింద పడ్డాడు)

**పార్వ** : ఏమండీ! (అని జగన్నాధాన్ని పట్టుకుంది)

**రాజ్య** : ఏమండీ (అని కిందపడ్డ భర్త దగ్గరికెళ్ళి లేపబోయింది. విదిలించుకున్నాడు)

**చల** : (కిందకూర్చుని) ఒరేయ్!... ఇంటి అల్లుడ్ని... నామీద చేయిచేసుకుంటావా!

**జగ** : ఇంకొక్కమాట మాట్లాడితే మెడబట్టిగెంటుతాను. ఫో అవతలికి.

**చల** : పోతాను... నా కట్నండబ్బుతే! తే! నాకివ్వాల్సిన కట్నం అణాపైసల్తోసహా కక్కు... ఒక్కక్షణం నీయింట్లో వుంటే చెప్పుతో కొట్టు (లేచాడు)

పదవే... మీ అన్నయ్య చేసిన మర్యాద చూసావుగా ఇంకా సిగ్గులేకుండా కూచున్నావేంటి పద... ఓ – నేనే కూచున్నాను కదూ – (లేచి లోనకెళ్తూ) ఇదిగో నీ అంతు చూస్తాను (లోపలికి లాక్కెళ్ళాడు)

**తల్లి** : (పార్వతితో) నువ్వింత పని చేస్తావని అనుకుంటూనే వున్నానే...

**పార్వ** : నేనేం చేసానండీ మధ్యలో

**తల్లి** : నువ్వు చెప్పకపోతే అల్లుడ్ని ఉత్తిపుణ్యానికి చేయి చేసుకుంటాడా!...

**జగ** : నేనేం ఉత్తిపుణ్యానికి కొట్టలేదమ్మా... తాగివచ్చినందుకు కొట్టాను.

**తండ్రి** : తాగొస్తేమాత్రం ఇంటల్లుడిని కొడతావంట్రా... ఈ విషయం నలుగురికీ తెలిస్తే ఎంత అవమానం.. రేపతను తలెత్తుకుని తిరగ్గలడా!

**జగ** : తాగడం అవమానంకాదానాన్నా... తాగి యిష్టంవచ్చినట్లు వాగడం తప్పుకాదామ్మా! తప్పుచేసింది అతను, నేను కాదు.

**తల్లి** : మరి అలాంటి దోషిని ఇంట్లో ఎందుకు పెట్టుకోవడం ఆ కట్నం డబ్బు ఇచ్చేస్తే పెళ్ళాన్ని తీసుకుని పోతాడు గదా!... అందుకు చేతకాదు.

**జగ** : అమ్మా!

**తండ్రి** : మీ అమ్మ అన్నదాంట్లో తప్పేముంది. అతనేం మనింట్లో పనివాడో పాలవాడో కాదు. మనిష్టం వచ్చినట్లు మాట్లాడ్డానికి.

తల్లి : ఆ పనివాడికి, పాలవాడికి కూడా వాళ్ళకివ్వాల్సిన డబ్బులివ్వలేకపోయి మొన్న కాళ్ళు పట్టుకుని బ్రతిమాలాడావు. అలాంటిది ఇంటల్లుడిని ఇంత అవమానం చేస్తావా? అదీ తోడబుట్టిన దానికళ్ళముందు. దాని ఉసురు ఊరికేపోదురా!

పార్వ : అందరి ఉసురు తగిలి మేమేగా నాశనమైపోయేది.

తల్లి : ఏ కట్టెకు నిప్పంటే అదే కాల్తుంది. - కానొరేయ్ పెళ్ళాం చేతిలో ఇంతలా కీలుబొమ్మ అయిపోవడం ఏమగాడికీ తగదురా!

తండ్రి : తల్లిదండ్రుల పట్ల - తోడబుట్టిన వాళ్ళ పట్ల ఇంత నిర్లక్ష్యం పనికిరాదురా. నిన్ను దేవుడు కూడా క్షమించడు.

జగ : నాన్నా! అమ్మకు అర్థం కాకపోతే కాకపోవచ్చు కానీ నువ్వా ఈ సంసారాన్ని ఈదినవాడివే. మీకైనా తెలీదా! ఎవరో అన్నట్లు కాళ్ళు తడవకుండా సముద్రాన్ని ఈదేయవచ్చు కానీ కళ్ళు తడవకుండా సంసారాన్ని ఈదలేం.. ఈ కుటుంబాన్ని పోషించడం కోసం మీ అందరి కోర్కెలు, ఆశలు తీర్చడంకోసం, నేనెంత చాకిరీ చేస్తున్నానో మీకు తెలీదు.

తండ్రి : ఒరేయ్! సమర్థుడు ప్రతి సమస్యకీ ఓ పరిష్కారం వెతుకుంటాడు. అసమర్థుడు అన్నింటికీ ఆవేదన చెందుతాడు.

తల్లి : అబ్బా! వీడితో మాటలేంటండీ యింకా... అవతల అల్లుడుగారు జరిగిన అవమానానికి ఎంత బాధపడ్తున్నారో, ముందావిషయం చూద్దాంపదండి.

తండ్రి : (జగన్నాథం వంక నిరసనగా చూస్తూ) ఇలాంటి అసమర్థుడిని కన్నందుకు మనకీపాట్లు తప్పవు... పద. (తల్లీదండ్రీ లోపలికి వెళ్ళారు. జగన్నాథం వేదనగా చూస్తున్నాడు. భార్య ఓదార్పుగా భుజం మీద చేయి వేసింది)

జగ : (భార్య వంక చూస్తూ) నిజమే పార్వతీ! నేనసమర్థుణ్ణే. మంచితనానికి మరోపేరు అసమర్థత అని ఇప్పటి వరకు తెల్సుకోలేకపోయాను పార్వతి.

పార్వ : (ఏంటండీ.) /ఏవండీ

జగ : నేను మంచివాడ్నా? అసమర్థుడ్నా.

పార్వ : (ఏమిటండీ)... ఇప్పుడేమైందని అంతలా బాధపడ్తున్నారు.

జగ : నీకు తెలీదు పార్వతీ! నా బాధ.

(గణపతి ప్రవేశం...)

గణ : హమ్మయ్య మొత్తానికింట్లో దొరికేసినారుగద!

(జగన్నాథం భయంగా చూసాడు)

గణ : జగన్నాథం బాబూ ఇదేం బాగులేదండీ... మేనేజరు గారికి టీ తెచ్చిద్దాంగదా అని బయటికెళ్ళానో లేదా మాయమైపోయారుగద!

జగ : కూర్చో గణపతీ!

గణ : కూర్చుంటే ఎలాగండీ... ఇవాళ చీటీలు కట్టేరోజు... త్వరగా ఇచ్చేయండి వెళ్ళిపోతాను.

జగ : (సంశయిస్తూ) ఈ నెల కొంచెం సర్దుబాటుకాదు గణపతీ!

గణ : అనేశారా! ఆ మాటనేశారా! నేననుకుంటూనే వున్నా... బాబూ ఒక్కమాట చెప్పండి సంవత్సరానికి పన్నెండు నెలలు... ఇవికాక మీకు సర్దుబాటయ్యే ఇంకోటేదైనా వుందా చెప్పండి... అప్పుడొస్తాను...

జగ : అదికాదు గణపతీ! .... ఈ నెల కొంచెం అనుకోని ఖర్చులు వచ్చాయి.

గణ : అందుకని నాకివ్వాలనుకోవడం లేదు మీరు!

జగ : కొంచెం అర్థం చేసుకో గణపతీ!

గణ : ఆర్నెళ్ళనుంచీ అర్థం చేసుకుంటూనే వున్నా! ఇంకా ఎంతకాలం ఆగమంటారండీ అవతల నేను ఇవ్వాల్సిన వాళ్ళు నన్నూ అర్థం చేసుకోవాలిగద?

జగ : నువ్వే అలా అంటే ఎలా?....

గణ : ఆఫ్ట్రాల్ మీ ఆఫీసులో ఫ్యూన్‌గాడిని, నేనేమన్నా లక్షాధికారినా బాబూ. ఎన్నాళ్ళయినా ఆగడానికి... ఏదో అవసరం అన్నారుగదా అని... సమయానికి నాదగ్గర లేకపోయినా వేరేవాళ్ళ దగ్గర తీసుకుని ఇచ్చా... ఇలా తిప్పించుకోవడం ఏం బాగాలేదు సార్!

జగ : నిజమే! కానీ!... (ఏం చెప్పాలో తోచలేదు)

పార్వ : వచ్చేనెలలో తప్పకుండా ఇస్తాం బాబూ... ఈ ఒక్కసారి కాస్త అర్థంచేసుకో!

గణ : ప్రతినెలా ఇదేవరసమ్మా... గంటముందడిగితేనేమో ఇంకా జీతం తీసుకోలేదు తీసుకోగానే ఇచ్చేస్తానంటారు. గంట తర్వాతడిగితేనేమో వచ్చిన జీతం అయిపోయిందీ అంటారు... ఎలా చచ్చేది....

జగ : కొన్నాళ్ళు ఆగు గణపతీ! నీ బాకీ మొత్తం యిచ్చేస్తాను.

గణ : ఎన్నాళ్ళు... ఎన్నాళ్ళాగాలో చెప్పండి... ఒకే గణపతి నాలుగు నెలలాగు అంటే ఆగుతా! నాలుగేళ్ళు ఆగూ అటే ఆగుతా! కరెక్టుగా చెప్పండి ఎన్నాళ్ళు ఆగాలో...

జగ : నేను ఇచ్చేంతవరకూ ఆగు!....

గణ : బాగా చెప్పారండీ! తమరలా... కూచోండి నేను చచ్చిపోయేపుడు వీలునామా రాసి చచ్చిపోతాను ఫలానా జగన్నాథంగారికి రెండువేలు అప్పుయిచ్చాను. అది వసూలు చేసుకోడానికి నాకెలాగు పెళ్ళాం పిల్లలు లేరు కాబట్టి, మా ఇంటి

ఓనరుకో వాళ్ళ పిల్లలకో వీలునామా వ్రాసిస్తాను. వాళ్ళకైనా ఇస్తారా? కొన్నాళ్ళాగమంటారా?

**జగ** : అలా వ్యంగ్యంగా మాట్లాడకు గణపతీ!

**గణ** : ఇంత చిన్నమాటకే మీరు బాధపడిపోతున్నారే! మీకిచ్చిన డబ్బు వసూలు చేసుకోడానికి ఇప్పటిదాకా మీ ఇంటిచుట్టూ తిరిగిందానికి నాకు ఐదొందల ఇరవై రూపాయలు ఆటోఖర్చులైనాయి. మీకు అప్పిచ్చినందుకు అదో బొక్క!... నాకెంత బాధుండాలంటారు.

**పార్వ** : నిజమేనయ్యా! నీ బాకీ ఎగ్గొట్టాననడం లేదు గద!

**గణ** : అట్లా అన్నా బాగుండేది. వదిలేసి పోయేవాడిని తిరుపతి హుండీలో వేసాననుకుని... అట్లాగూడా అనరే... ఎపుడు అడిగినా వచ్చేనెలిస్తా వచ్చేనెలిస్తా అంటారేతప్ప ఇచ్చింది లేదు చచ్చింది లేదు.

**జగ** : నేను చచ్చేలోపల నీ బాకీ వడ్డీతో సహా యిచ్చేస్తాను గణపతీ! నీ ఋణానపడి మాత్రం చావను....

**గణ** : అంతంత పెద్దమాటలెందుకులే సార్....

**జగ** : ఏం చేయనుచెప్పు. నా జీవితంలో సగభాగం చీకట్లోనే గడిచిపోయింది.

**గణ** : ఒకమాట చెప్పనా? సార్ రోజులో సగం చీకటే అని విచారిస్తే అది నిరాశ. సగమేగా చీకటి అని సంతోషిస్తే అది ఆశావాదం – భవిష్యత్తు బాగుంటుందనే ఆశిద్దాం సార్! తమరి దగ్గరున్నప్పుడే ఇద్దురుగానీ

**తండ్రి (OBV) :** నామాట విను బాబూ!

**చల (OBV) :** వినను! విననంటే వినను! ఇంటల్లుడిని పట్టుకుని కొడతారా?

**తల్లి (OBV) :** పొరపాటైంది బాబూ! ఈ ఒక్కసారికీ క్షమించునాయనా

**చల (OBV) :** నో–నో క్షమించే ప్రసక్తే లేదు... రావే వెళ్దాం....

**రాజ్యం (OBV) :** ఏమండీ! ... నామాట వినండీ!....

(చెళ్ళున కొట్టిన చప్పుడు – జగన్నాథం ఉలిక్కిపడతాడు – గణపతి వింతగా చూసాడు భార్య తలవంచుకుంది. చలపతి సూట్‌కేస్‌తో వచ్చాడు – చెల్లెలు వెనకాలే కళ్ళనీళ్ళతో వచ్చింది – ఆ వెనకాలే తల్లిదండ్రులు వచ్చారు)

**చల** : (జగన్నాథం వంక సీరియస్‌గా చూస్తూ) వినను... నేనెవ్వరిమాటా వినను... వినను గాక విననంతే!

**పార్వ** : అన్నయ్యా! నీకు దండం పెడతాను.. లోపలికి వెళ్ళండి.

**చల** : వెరీగుడ్! మీ ఆయన కనబడిన వాడినల్లా కొడుతుంటాడు. నువ్వేమో తన్నులు తిన్నవాడికల్లా దండాలు పెడుతుంటావు.. అడ్డులే.... మమ్మల్ని వెళ్ళనీ...

పార్వ : ఇప్పటికిప్పుడు ఎక్కడికని వెళ్తారు... ఎలా బతుకుతారు... జరిగిందానికి నేను క్షమాపణ చెప్తున్నాను... దయచేసి లోపలికి పదండి.

చల : అంటే ఇప్పుడు మేము ఇల్లొదిలి వెళ్ళిపోతున్నామని అనుకుంటున్నారా! నీకంటికి అంత వెర్రినా కొడుకు మాదిరి కనబడుతున్నానా!... నేను వెళ్తానన్నది పోలీస్‌స్టేషన్‌కి.

పార్వ : పోలీస్‌స్టేషన్‌కా!

చల : అవును.... శ్రీశ్రీశ్రీ జగన్నాధరావుగారనే మా బావగారు నన్ను చాచి లెంపకాయ కొట్టారుకదా!... నా వీపు మీద దబీ దబీమని నాలుగు గుద్దులు గుద్దాడు కదా! అలా చేయడం చట్టరీత్యానేరం... ఆ విషయం పోలీసులకు రిపోర్ట్ చేసి మా బావగారిని జైల్లో వేసి సన్మానించాలికద.

గణ : ఏంటిబాబూ ఈయన్ని జైల్లో తోయిస్తావా!... ఎందుకూ!

చల : ఓహో ఇందాకటి నుంచీ సీన్లో నువ్వు లేవుగా.. ఈయనగారు నన్ను ఇంటి అల్లుడినని కూడా చూడకుండా కొట్టాడు. మాన్ హాండ్లింగ్ ఇజ్ ఎ గ్రేట్ అఫెన్స్ యునో...

గణ : ఆయన అట్లాంటివారుకాదే! ఎందుక్కొట్టారు బాబూ!

చల : ఒళ్ళుకొవ్వెక్కి.. ఏదో కాస్త తాగివచ్చాననుకో – అంతమాత్రం చేత కొడ్తావా?

గణ : మరి తాగిరావటం తప్పుగద సార్!

చల : తప్పని నాకు తెల్సు... కానీ ఏంచేయను.. నా గుండెల్లో బాధ ఎవరు అర్థం చేసుకుంటారు. ఈయనగారు తన చెల్లెల్ని నాకిచ్చి పెళ్ళి చేశాడు. ఇస్తానన్న కట్నం నాలుగేళ్ళయినా ఇంతవరకూ యివ్వలేదు. కట్నం పూర్తిగా తీసుకోకుండా కాపురం పెట్టడానికి మా అమ్మ నాన్న ఒప్పుకోవట్లేదు. అందుకే ఇక్కడే వుంటున్నాను. నేనేదో వీళ్ళింట్లోపడి మేసేస్తున్నట్లు చూస్తున్నారు. అలానన్ను ట్రీట్ చేస్తే నాకు బాధేయదా! ఆ బాధ మర్చిపోడానికి తాగాను. అలాంటప్పుడు నేను తాగడానికి కారణం ఎవరూ... ఇతనేగదా!

గణ : వదిలేయండి బాబూ.. ఎంతయినా మీ బావమరిదే కదా!

చల : ఓహో బాగా చెప్పారండి. మిమ్మలి సాచిపెట్టి ఒక్కటిచ్చాననుకోండీ.. పోన్లే అని వదిలేస్తారా...

గణ : వదిలేయడానికి మీరేం నా బామ్మర్ది కాదుగా... కీళ్ళిరగ్గొడతానండీ.

చల : బావైతే కొట్టే అధికారం వుందా... నో... నేను రిపోర్టు ఇవ్వాల్సిందే!

పార్వ : రాజ్యం నువ్వయినా చెప్పమ్మా... నీ మాట వింటారు!

రాజ్య : ఆయన నామాట వినడానికి మీరనుకున్న కట్నం ఇస్తేగా!

పార్వ : మామయ్యా! మీరైనా చెప్పండి

తండ్రి : చూడమ్మా! కొడుకనేవాడు పోలీసయ్యాడనుకో! దొంగల్ని పట్టుకొన్నందుకు సంతోషిస్తాం.. ఒకవేళ దొంగగా పుట్టాడనుకో, పోలీసులకి జెల్లకొట్టి తప్పించుకున్నందుకు సంతోషపడ్తాం... కానీ వీడూ...వీడొక అసమర్థపు గాడిద.. ఓ టాలెంట్ లేదు... ఒక పేషెన్స్ లేదు. ఓ లంచం తీసుకునే ధైర్యంలేదు... ఓ మోసంచేయగల తెలివీ లేదు.. ఇన్నాళ్ళనుండీ అడుగుతున్నాను... ఒరేయ్ తీర్థయాత్రలకు తీసుకెళ్ళరా అని ఊహూ.. కన్నతండ్రికి నెలకు ఓ రెండొందలు ఇవ్వడానికి ఆపసోపాలు పడిపోతున్నాడు... ఆ అడ్డగాడిదచేత అల్లుడిగారికి క్షమాపణ చెప్పించు. ఇంతకన్నా ఏం చెప్పను... (విసురుగా లోపలికెళ్లాడు)

పార్వ : అత్తయ్యా! మీరైనా నచ్చచెప్పండత్తయ్యా!

తల్లి : నేను నచ్చచెప్పడం కాదు – నువ్వే నీ మొగుడికి చెప్పు – చేసిన తప్పుకు అల్లుడిగారి కాళ్ళమీదపడి క్షమాపణ చెప్పుకోమను...

చల : పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళమంటావా? క్షమాపణ చెప్తావా?... నిన్నే... (జగన్నాథం శిలావిగ్రహంలా నిలబడ్డాడు)

చల : అంతనిర్లక్ష్యంగా వుందా నేనంటే... బావా! ... ఎప్పటికైనా నీచేత క్షమాపణ చెప్పించుకుని తీరతాను. అంతవరకూ నిన్ను మనశ్శాంతిగా బతకనివ్వను (భార్యతో) ఆకలేస్తుంది. అన్నం పెడ్తువుగానీ రా... భోంచేశాక వెళ్తా పోలీస్‌స్టేషన్‌కి. (సూట్‌కేస్‌తో లోపలికివెళ్ళాడు – చెల్లెలూ – తల్లీ అనుసరించారు.)

జగ : చూశావా గణపతీ! ఈ ఇంటికోసం వీళ్ళందరి ఆశలకోసం ఇంత శ్రమపడుతున్నా ఎవరికి కృతజ్ఞతలేదు. కనీసం సానుభూతి కూడ లేదు. అయినా నా పిచ్చి గానీ గాడిదతో చాకరీ చేయించుకుంటారుగానీ దానికి ఎవరైనా కృతజ్ఞత చెప్తారా! చెప్పరు. గాడిదకు ఎవరు కృతజ్ఞత చెప్పరు! ప్రశాంతంగా బతకనివ్వరు.

గణ : ఆ క్షమాపణేదో అడిగితేపోయేదికదా బాబూ.. గొడవెందుకు.

జగ : (నవ్వాడు – తెరలు తెరలుగా నవ్వాడు... నవ్వు విషాదంగా మారింది) నిజమే! క్షమాపణ అడగాలి... ఎంతోమందిని అడగాలి.. నాలాటి పనికిమాలిన వాడిని కన్నందుకు వాళ్ళకేమీ చేయలేకపోతున్నందుకు నా తల్లిదండ్రులను క్షమాపణ అడగాలి... అప్పుచేసి మరీ ఘనంగా పెళ్ళిచేసినా తన గొంతెమ్మ కోర్కెలు తీర్చనందుకు అలిగి నాయింట్లోనే కూర్చున్న నా చెల్లెల్ని క్షమాపణ అడగాలి... పెళ్ళయిన దగ్గర్నించీ పావలాపెట్టి మల్లెపూలు కూడా తీసుకురానందుకు మనసులో కుమిలిపోతున్నా పైకి చిరునవ్వుతో పలకరించే నా భార్యను

క్షమాపణ అడగాలి.... నాలాంటి అసమర్థుడి కడుపున పుట్టిన నేరానికి మంచి చదువులకు నోచుకోక మేనమామ గారింట్లో దిక్కులేకుండా పడివున్న నా బిడ్డల్ని క్షమాపణ అడగాలి... నా అవసరాలకోసం అప్పిచ్చి నా చుట్టూ తిరుగుతున్న నీలాంటి మంచి వాళ్ళందరినీ క్షమాపణ అడగాలి... అందర్నీ అడగాలి.

**గణ** : మా అందరికన్నా ముఖ్యంగా ఇంకొకర్ని క్షమించమని అడగాలి బాబూ!

**జగ** : ఎవర్ని...

**గణ** : దేవుడ్ని...

**పార్వ** : దేవుడ్నా!... ఎందుకడగాలి... దేవుడ్నెందుకడగాలి! మనుష్యుల పట్ల తప్పుచేశారేమోగానీ... దేవునిపట్ల ఆయనే తప్పు చేయలేదు.

**గణ** : అస్సలు తప్పు అక్కడే జరిగి ఉంటుందమ్మా! అవును బాబూ! ఏ జన్మలో దేవుడ్ని ఎలాంటి కోరిక కోరారోగానీ ఈ జన్మలో ఈ గాడిద బతుకొచ్చింది తమరికి.

**జగ** : నిజమే! నువ్వు చెప్పింది నిజమే గణపతీ! దేవుడ్ని తప్పకుండా అడగాలి. నేను చేసిన తప్పుకి ఆ దేవుడ్ని మనసారా క్షమాపణ అడగాలి... అడుగుతాను... భగవాన్! నేను చేసిన మహాపరాధాన్ని క్షమించు. వచ్చే జన్మంటూవుంటే అరణ్యంలో జంతువులా పుట్టించు, శ్లేష్మంలో ఈగలా పుట్టించు, ఆఖరికి పేడలో పురుగులా పుట్టించు, అంతేగానీ ఈ మధ్యతరగతి, మానవజన్మ మాత్రం వద్దు... ఇంకా ఈ సంసార సుడిగుండాన్ని ఈదలేను. ఈ చాకిరీ చేయలేను. దయచేసి నన్ను క్షమించి ఈగాడిద బతుకునుంచి విముక్తిడ్ని చెయ్... (చేతులు జోడించి మోకాళ్ళమీదికి జారిపోయాడు... భార్య. గణపతి చెరోపక్కనుంచుని జాలిగా చూస్తున్నారు)

(Lights off - Lights on)

# మూడవ రంగం

(జగన్నాథంకి అరవై దాటింది - రంగస్థలం సూర్యప్రకాష్ ఇల్లు - విలాసవంతంగా ఉంది. టెలిఫోన్ రింగ్ అవుతోంది... గణపతి బయట నుండి కూరగాయల సంచితో వచ్చాడు)

**గణ :** వస్తున్నా! వస్తున్నా! (ఫోన్ ఎత్తాడు) హల్లో... నమస్కారం అండీ ఎవరండీ మాట్లాడుతున్నారు... సార్ బాత్‌రూంలో వున్నారండీ... అమ్మగారు అర్జంట్ పన్లో వున్నారండీ... ఏంటీ అంత డబ్బున్నవాళ్ళు పన్జేయాల్సిన అవసరమేంటంటారా? అలా అడిగారు కాబట్టి ఓ మాట చెప్తాను వినండి. డబ్బుతో ఏమైనా చెయ్యగలం అనుకునేవాళ్ళు డబ్బుకోసం ఏమైనా చేసేస్తారండీ! మా అయ్యగారు కూడా అదే కోవకు చెందినవాడేనండీ! కానండీ డబ్బు ప్రారంభంలో సంతోషాన్ని, మధ్యలో దుఃఖాన్ని చివర్లో పశ్చాత్తాపాన్ని కలిగిస్తుందండీ! ఈ సత్యాన్ని ఎవరు గుర్తుపెట్టుకుంటారో వాళ్ళకు ధనం దైవంలా కాపడుతుందండీ మర్చిపోయిన వాళ్ళకది దెయ్యమై పీడిస్తుంది!... నేనాండీ! ఇంట్లో నౌకర్నండీ! పేరుకు నౌకరునైనా పవర్‌కి మాత్రం మోర్ దేన్ ఓనర్నండీ! ఇప్పుడు పెద్దవాళ్ళ ఇళ్ళలో వ్యవహారాలెట్లా ఉంటాయంటే, వాళ్ళు ప్రతిదానికీ పనివాళ్ళమీద ఆధారపడిపోతారండీ! అంచేత పవర్ నెమ్మదిగా పనివాళ్ళ చేతుల్లోకి వచ్చేస్తాదండీ! నాకు వాళ్ళు పిడికెడన్నం పెడితే నేను వాళ్ళకు బండెడు చాకిరి చేస్తుంటానండీ.. ఇంతకూ తమరెవరండీ... (అదిరిపడ్డాడు) అయ్యబాబో... అయ్యగారి మామగారా!... నమస్కారమండీ... నేను తప్పుగా ఏం మాట్లాడలేదండీ మీరేం వినలేదండీ...(ఫోన్ పెట్టేశాడు. సూర్యప్రకాశ్ ఎంటర్ అయ్యాడు)

**సూర్య :** ఎవర్రా ఫోన్ చేసింది!

**గణ :** బాబుగారండీ!

**సూర్య :** మా బాబు ఇంట్లోనే వున్నాడుగదరా!

**గణ :** మీ బాబు కాదండీ బాబూ... అమ్మగారి బాబుగారు...

**సూర్య :** మామయ్యా! మరి ఫోన్ పెట్టేశావేం!

**గణ :** నేను పెట్టలేదండీ... ఆయనే పెట్టేశారు... తమర్ని ఫోన్ చేయమన్నారండీ. (సూర్యప్రకాష్ సెల్‌తో డయల్ చేసాడు)

**సూర్య :** హల్లో... మామయ్యా నేను సూర్యాన్ని.. ఏంటి ఫోన్ చేసావట. అలాగా... మీరు అత్తయ్య కలిసివస్తున్నారా! ఓకే... ఓకే... మీ అమ్మాయికేం బ్రహ్మాండంగా వుంది....ఆ... లోపలేదో పనిలోవుంది. నే చెప్తాలే...ఆఁ! ఆఁ! బంగ్లా బాగుంది మామయ్యా... మీరొచ్చాక చూసి సెటిల్ చేసుకుందాం... ఆ!

అతను... గణపతి అని మనింట్లో పని చేస్తున్నా.... మా నాన్నగారి ఆఫీసులో పన్జేసి రిటైరయ్యాడు. ఆహా! అలాగా... ఏమన్నాడేమిటి?.. ఆహా! అతనంతేలే.... బాగా చదువుకున్నాడు – ఆ తెలివి అలా ప్రదర్శిస్తుంటాడు... (ఫోన్ పెట్టేశాడు – గణపతితో) – మావయ్యకి ఏదో లెక్చర్ ఇచ్చావుట.

**గణ** : అబ్బే నేనేవనలేదండి... డబ్బు యెంత పాపిష్టిదో చెప్పానంతే...

**సూర్య** : సర్లేగానీ... లోపల నా రిస్ట్ వాచుంటుంది. పట్రా – (జగన్నాథం లోపలనుంచి వచ్చాడు... కుర్చీలో కూర్చున్నాడు... సూర్యం జగన్నాథం వంక చూసి లోనకెళ్లాడు. జగన్నాథం టీపాయ్ మీదున్న పేపర్ తీసి చూస్తున్నాడు... డోర్ బెల్ మ్రోగింది... జగన్నాథం గుమ్మం వంకా లోపలివంకా చూసాడు... మళ్ళీ మ్రోగింది... ఇంకోసారి మ్రోగింది...

**సూర్య** : (తండ్రితో) ఎవరో కాలింగ్ బెల్ కొడుతున్నారు. వెళ్ళి తలుపు తీయొచ్చుగా ఇపుడా పేపర్ చదవటం అంత ముఖ్యమా?....

**జగ** : మొన్నోసారి ఇలాగే వెళ్ళి తలుపుతీస్తే నువ్వెందుకుతీసావ్... (అటెండరున్నాడు) గణపతి ఉన్నాడు కదా అని నువ్వేగా అన్నావ్!

**సూర్య** : నిజమే అన్నాను.... (అటెండర్) గణపతి వుంటే తీస్తాడు... వాడులేనప్పుడు వాడిబదులు నువు తీస్తే తప్పా!

**జగ** : తప్పనికాదు నా ఉద్దేశ్యం....

**సూర్య** : చాల్లే ఊర్కో (బెల్ మ్రోగింది) వెళ్ళి చూడెవరో... (జగన్నాథం గుమ్మం దగ్గరికి వెళ్ళాడు... సెల్ రింగ్ అయింది. సూర్యం సెల్‌లో మాట్లాడుతున్నాడు. జగన్నాథం తలుపు తీసుకొని బయటకెళ్ళాడు)

**సూర్య** : హల్లో... సూర్యప్రకాష్ హియర్..... ఒరేయ్! నువ్వా!... ఎక్కడి నుంచీ.... ఆ... బాగున్నాం.... ఇన్నాళ్ళకు గుర్తొచ్చాంరా... నా భార్యను చూడనే లేదా.... ఒకసారి ఫ్యామిలీని తీసుకుని ఇంటికిరా... ఆ...ఆ... మామయ్య కూతురేగానీ నన్ను చదివించిన మామయ్యకాదు. అవును. మా రాజ్యం అత్తయ్య వుందిగా ఆమె కూతురు. అవునవును... అపుడు మామయ్య పనికిమాలినవాడే! కానీ సడన్‌గా పెద్దవాడై పోయాడులే. ఈ దేశంలో మంచివాడు మహోన్నతుడు కావడం కష్టంగానీ, బతకనేర్చినవాడు ఎంత పనికిమాలిన వెధవైనా సడన్‌గా పెద్దవాడైపోవడం పెద్ద కష్టమేమీకాదు అందుకు రెండు మార్గాలున్నాయి. ఒకటి కాంట్రాక్టులు, రెండు రాజకీయాలు. ఇప్పుడు మామయ్యది రెండు రంగాల్లోనూ రాటు తేలిన హస్తం.... అబ్బో! బాగా సంపాదించాడులే... మా నాన్నగారా! రిటైరైపోయారు! ఇప్పుడు అమ్మ నాన్న నా దగ్గరే ఉన్నారు. (జగన్నాథం పాలపాకెట్‌తో బయట నుండి వచ్చాడు) మీ నాన్నగారూ! వాట్! చనిపోయారా? ఎప్పుడు... అవునా!... మీ నాన్న నీకు గొప్ప ఉపకారం

చేసాడురా! నువ్వెంత అదృష్టవంతుడివో తెల్సా! ఏం అదృష్టమంటావా! చెప్తాను విను. చిల్డ్రెన్ లేటుగా పుట్టాలి. తల్లిదండ్రులు ఎర్లీగా పోవాలి. అంతకు మించిన అదృష్టమేముంది మనిషి లైఫ్‌లో. (జగన్నాథం పాలపాకెట్‌తో అలా నుంచుండి పోయాడు) ఓకే ఉంటాను మరి.

**సూర్య :** అలా ధ్వజస్థంభంలా నిలబడకపోతే లోపలికెళ్ళి ఆ పాకెట్ అమ్మచేతికి ఇవ్వొచ్చుగద.... మళ్ళీ కాఫీ ఇవ్వడం పదినిముషాలు లేటైతే తలనొప్పని మొత్తుకుంటావుగద... (అంటూ లోపలికెళ్ళాడు. జగన్నాథం మెల్లిగా వంటింటి వైపు వెళ్ళబోతుండగా! గణపతి లోపల్నించి వచ్చాడు)

**గణ :** అయ్యబాబో! మీరు తీసుకురావడమేంటి సార్... నేను వచ్చేవాడిని కదా!

**జగ :** పర్వాలేదులే గణపతీ!... ఇందులో తప్పేం వుంది!

**గణ :** భలేవారు ఇలా యివ్వండి (పాకెట్ తీసుకున్నాడు)... తమరు పేపర్ చూస్తాకూచోండి చిటికెలో పెద్దమ్మగారితో చెప్పి మంచి కాఫీ పట్టుకొస్తాను... (లోపలికెళ్ళాడు - జగన్నాథం మళ్ళీ కుర్చీలో కూర్చుని పేపర్ చదువుతున్నాడు. సుజాత లోపలినుంచి వచ్చింది - జగన్నాథాన్ని చూసి మొహం చిట్లించింది. ఆమె వెనకే సూర్యప్రకాష్ వచ్చాడు - సూర్యప్రకాష్‌కు సైగ చేసింది.)

**సూర్య :** నాన్నా ఇలా ఇరవై నాలుగ్గంటలూ హాల్లో కూర్చుని పేపరు చదువుతూ వుంటే మాకెంత డిస్టబెన్స్‌గా వుంటుందో తెలుసా నీకు.

**జగ :** నేను పేపరు చదువుతున్నానే తప్ప మీకెవరికీ అడ్డంగా లేనుగదరా!

**సుజాత:** అలాగంటారేమిటి మామయ్యా... ఇంట్లోకి ఎవరెవరో పెద్దవాళ్ళు వస్తూ వుంటారు ఆయనకోసం... మీరిలా అడ్డంగా కూర్చుని వుంటే ఎంత ఇన్‌కన్వీనియంట్‌గా వుంటుందో... నేను కూడా హాల్లో ఫ్రీగా తిరగలేను గద.

**జగ :** అమ్మా! మాకంటూ ఈ ఇంట్లో సెపరేట్‌గా ఏగదీ లేదుగదమ్మా. ఎంతసేపని ఆ వరండాలో కూర్చుంటాను చెప్పు....

**సూర్య :** అంటే మీరనేదంటి? మీకోసం ప్రత్యేకంగా ఓ గది కట్టించి ఇమ్మంటారా!

**జగ :** ఆ మాట నేనన్లేదురా...

**సుజా :** అంటే! మా గది ఖాళీచేసి మీకిచ్చి మమ్మల్ని వరండాలో వుండమంటారా!

**జగ :** నా ఉద్దేశ్యం అదికాదమ్మా!

**సూర్య :** నువ్వే అర్థం చేసుకోవాలి నాన్నా - ఇలా ప్రతిదీ చెప్పించుకోగూడదు. చెప్పాలంటే మాకూ కష్టంగానే వుంటుంది....

**జగ :** సరేలేరా నేనే వెళ్ళి ఆ వరండాలో కూర్చుని చదువుకుంటానులే (జగన్నాథం మెల్లిగా లేచి పేపరు చేత్తో పట్టుకుని బయటికి వెళ్ళాడు)

**సుజా :** అబ్బబ్బా! ఈ ముసలాయనతో చచ్చిపోతున్నానండీ....

**సూర్య :** ఏం చేస్తాం! తప్పదు!

**సుజా :** ఏమిటండీ తప్పకపోవడం... తీసుకెళ్ళి ఏ ఓల్డేజ్‌హోం లోనో పారేయండి.

**సూర్య :** అపుడూ మనకే పరువుతక్కువ ఫలానా సూర్యప్రకాష్ తన తండ్రిని పోషించలేక వృద్ధాశ్రమంలో వుంచాడు అని అందరూ నన్నే అంటారు.

(పార్వతి ట్రేలో కాఫీ కప్స్‌తో వచ్చింది - వెనకే గణపతి వచ్చాడు)

**సూర్య :** అదేంటమ్మా నువ్వు తెచ్చావ్... గణపతి వున్నాడుగా... (కాఫీ అందుకున్నాడు)

**పార్వ :** పర్వాలేదులేరా. నా కొడుక్కీ కోడలికేగా చేస్తున్నాను. (సుజాతకు కప్ యిచ్చింది) మీ నాన్నగారు ఏర్రా?....

**సూర్య :** ఆ వరండాలో కూర్చుని పేపరు చదువుకుంటున్నారు!

**పార్వ :** ఈ చల్లగాలిలో వరండాలో కూర్చోడమేమిటీ మనిషి బొత్తిగా తెలివి లేకుంటే!

**సుజా :** అప్పటికీ నే చెబుతూనే వున్నా. ఇక్కడే కూర్చుని చదువుకోండి మామయ్యా అని – నా మాట వింటేగా.

**పార్వ :** నిజమేనమ్మా... ఆయనకు తెలీదు. ఒకరు చెప్తే వినరు...

**గణ :** అబ్బా! నోటితో ఉందని అంటావు. నొసలుతో లేదని చెబుతావు. తెలివంటే నీదేనమ్మ.

**సుజా :** నోర్ముసుకొని నీ లిమిట్స్‌లో నువ్వుండు

**గణ :** అలాగేనమ్మా... (కప్ తీసుకుని బయటికి వెళ్ళాడు) (పార్వతి ఆయాసంగా నిట్టూర్చుతూ మొహం కొంగుతో తుడుచుకుంది)

**సూర్య :** (ఆదుర్దాగా) ఏమ్మా అలా వున్నావు ఒంట్లో బాగాలేదా!

**పార్వ :** నాకేంరా బాగానే వున్నాను.....

**సూర్య :** బాగుండటమేంటి నీ మొహం... నీరసంగా వున్నట్లున్నావ్... సుజాతా! అమ్మను రేపు డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళు.

**సుజా :** అలాగేనండీ.

**పార్వ :** ఇపుడు నాకు డాక్టర్లెందుగ్గానీ.... మీ నాన్నగారేదో కీళ్ళ నొప్పులంటున్నారు. ఆయన్ని తీసుకెళ్ళు హాస్పిటల్‌కి.

**గణ :** సర్లే! ఆయన్ని తీసుకెళ్ళి మాత్రం ప్రయోజనం ఏమిటి?... డాక్టర్ చెప్పినట్లు వింటాడా ఏమన్నా... హాస్పిటల్ ఫీజు దండగ తప్ప ఏం ప్రయోజనం లేదు.

**పార్వ :** అదేంటిరా అలాగంటావు.

**సూర్య :** లేకపోతే ఏంటమ్మా! పోయిననెల్లోనేగా డాక్టర్‌తో చెకప్ చేయించాను.

ఆయనేమన్నాడు... ఊరికే తిని కూచుంటే అనారోగ్యం... ఆ పనులూ ఈ పనులూ చేస్తూ వుండాలి అన్నాడా!... ఈయన వినిపించుకున్నాడా!.. కనీసం బజారెళ్ళి సరుకులైనా తీసుకురండీ... కాస్త ఎక్సర్‌సైజ్‌గా వుంటుందీ అంటే వింటాడా? కీళ్ళ నొప్పులూ కాళ్ళనొప్పులూ అని ఎప్పుడూ ఇంట్లోనే కూర్చుంటాడు....

**సుజా :** అటూ యిటూ తిరుగుతూ కాస్తపన్లవీ చేస్తుంటే అన్నీ అవే సర్దుకుంటాయంటే ఆ మనిషికి అర్థంకాదు.... గట్టిగా చెప్తామంటే మామగారితో పనులు చేయిస్తున్నానని నన్ననుకుంటారు. (గణపతి వచ్చాడు – సుజాత అతన్ని చూసి ఏమైనా అనేస్తాడేమోనని భయపడింది. కానీ ఏవనకుండా లోనకు వెళ్ళిపోయాడు)

**పార్వ :** ఎందుకనుకుంటార్లేమ్మా! అయినా విషయం తెలీని వాళ్ళు ఎన్ననుకుంటే మనకేంటి!

**సూర్య :** నాన్న సంగతి తర్వాత! ముందునువ్వు రేపు డాక్టర్ దగ్గరికి వెళ్ళు.....

**పార్వ :** అలాగేలేరా... అమ్మాయ్..! ఇవాళ వంటేం చేయమంటావ్....

**సూర్య :** దాన్నడిగేదేంటమ్మా! నీకిష్టమైంది చెయ్యి.. నువ్వేంచేసినా అమృతం లాగుంటుంది. (పార్వతి నవ్వుకుంటూ లోపలికి వెళ్ళింది).

**సుజా :** ఏంటీ మీ అమ్మమీద ఉన్నట్లుండి అంతప్రేమ కారిపోయింది....

**సూర్య :** ఓసి పిచ్చిదానా! ఆమాత్రం ప్రేమ కార్చకపోతే పనులు జరగవ్!...

**సుజా :** అంటే!

**సూర్య :** మదర్ ఇజ్ ద ఫస్ట్ అండ్ బెస్ట్ సర్వెంట్ ఆఫ్ ద మాన్ అంటారు.... మా అమ్మ ఎప్పటికీ ఆరోగ్యంగా ఉండాలి. ఎందుకూ! పనులన్నీ చకచక చేసేసుకుంటుంది.

**సుజా :** మదర్ బెస్ట్ సర్వెంటన్నారు... మరి ఫాదరో....

**సూర్య :** ది వరస్ట్ క్రిటిక్ ఇన్ ది వరల్డ్ – కొడుకులకి ఎంతవయసొచ్చినా వాళ్ళనింక చిన్నపిల్లల్లా చూస్తూ ప్రతిదాన్ని విమర్శించే క్రిటిక్.. అందుకే తల్లులు చల్లగా వుండాలి, తండ్రుల్ని తగలెయ్యాలి... (గణపతి లోపల నుండి వచ్చాడు)

**గణ :** ఆహా! వేదంలాటి మాటలు సెలవిచ్చారు బాబూ... మీ అదృష్టం బాగుండి మీ అబ్బాయిగారు ఇక్కడలేరు.....

**సూర్య :** మూస్తావా?..... లోపలికి కెళ్ళు... (గణపతి లోపలికెళ్ళాడు)

**సుజా :** వీడికి రాను రాను నోటిదురుసెక్కువైంది.... ముందు వాడిని పనిలోంచి తీసేయండి.

సూర్య : పోన్లే సుజాతా! పాపం మనల్నే నమ్ముకుని వున్నాడు.

సుజా : వుంటే ఉండొచ్చుండీ.... అంత మాత్రంచేత వాడి నోటి దురుసు భరిస్తూ వుండాలా!..

సూర్య : అబ్బా! వాడితో ఏంటి చీప్‌గా!... వదిలెయ్.. అన్నట్లు మర్చిపోయాను మీ అమ్మానాన్నా వస్తున్నారివాళ.

సుజా : (ఆనందంగా) ఏమిటీ? అమ్మా నాన్నా వస్తున్నారా?....

సూర్య : అవును. దే ఆర్ ఆన్ ది వే. మనం కొత్త బంగ్లాకొనాలనుకున్నాం గద – చూడ్డానికి వస్తున్నారు.... (గుమ్మంవైపు చూసి) అదిగో మాటల్లోనే వచ్చారు.

చల : దటీజ్ చలపతి – హాయ్ బేబీ – (రాజ్యం చలపతి వచ్చారు. చలపతి సూట్‌లో రిచ్‌గా వున్నాడు. సుజాత ఎదురెళ్ళింది.)

సుజా : హాయ్ డాడ్! అమ్మా!.... (ఇద్దరూ కౌగిలించుకున్నారు)

రాజ్యం : ఎలా వున్నావమ్మా!

సుజా : నాకేవమ్మా ఫస్ట్ క్లాస్.

సూర్య : అమ్మా! మామయ్యా వాళ్ళొచ్చారు... (కేకేసాడు)

చల : ఏంబాబూ సూర్యం ఏంటి సంగతులు... బాగున్నావా!....

సూర్య : బాగున్నాను మామయ్యా... ప్రయాణం బాగా జరిగిందా?

చల : ప్రయాణాలెపుడూ బాగానే వుంటాయి... మనకు ఎంజాయ్ చేసే ఓపిక వుండాలి గానీ! (పార్వతి లోపలనుంచి వచ్చింది)

పార్వ : బాగున్నావా రాజ్యం....

రాజ్య : (ముక్తసరిగా) ఆ....

చల : ఏమ్మా! బావగారేరీ...

పార్వ : వరండాలో వున్నారన్నయ్యా....

చల : ఏది! మేం వచ్చేటప్పుడు వరండాలో పేపరు చదువుతూ కూర్చుంది బావగారా... నేను కలసివస్తాను!

పార్వ : మీరుండండి....నేవెళ్ళి పిలుచుకువస్తాను. (అంటూ వరండావైపుకెళ్ళింది)

చల : మొత్తానికి మీ నాన్నను వరండాకు షిఫ్ట్ చేసావన్నమాట...

రాజ్య : ఈవిడగారేం నీమీద పెత్తనం చేయడం లేదుగద!

సుజా : అంత స్కోప్ నేనివ్వను గద...

చల : రాజ్యం... మేయిన్ విషయాలెపుడూ మేయిన్ హాల్లో మాట్లాడకూడదు.... ఎక్కడేది మాట్లాడాలో అదే మాట్లాడాలి....

సూర్య : ఏం ఫర్లేదులే మామయ్యా... అత్తయ్య తప్పుగా అడగలేదుగా!

చల : ఇపుడు నాకు మరీ నచ్చావల్లుడూ...

(జగన్నాథం, పార్వతి వరండాలోంచి వచ్చారు)

జగ : బాగున్నావా రాజ్యం!

రాజ్య : ఆఁ!

జగ : ఏం చలపతీ ఎలా ఉన్నావు?

చల : నాకేం బావా. బ్రహ్మాండంగా ఉన్నాను, వుంటాను... ఎటొచ్చీ నీకే కీళ్ళనొప్పులు, కాళ్ళనొప్పులు, షుగరూ, బీపీ... వున్నాయి. తొందర్లో దేవుడు దయతలిస్తే హార్ట్‌అటాక్ కూడా వస్తుందేమో....

పార్వ : అవేం మాటలన్నయ్యా!

చల : నిజం ఎప్పుడూ నిష్ఠూరంగానే వుంటుందమ్మా.. నన్ను చూడు... బండరాయిలా బ్రహ్మాండంగా వున్నాను. ఏ రోగాలు రొష్టులూ నా దగ్గరికి రావు... ఎంచేతంటావ్. ఈ బాడీకి మొదట్నించి ఎదవదరిద్రపు అలవాట్లన్నీ చేసి రాటుతేల్చి పారేశాను. అడ్డమైన తిళ్ళుతినీ, అడ్డమైన తాగుళ్ళు తాగి.... ఏరోగాన్నయిన తట్టుకునే రెసిస్టన్స్ పవర్ బాడీకి వచ్చేలా చేశాను... మరి మీయాయనో... సంప్రదాయబద్ధంగా జీవించేసి అడ్డమైన రోగాలు పెంచేసుకున్నాడు.

రాజ్య : బాగా చెప్పారు! డబ్బైనా, జబ్బైనా మన రాతబట్టే వస్తాయి ఎవరికేది ప్రాప్తమో ఎవరు చెప్పగలరు.

చల : (అది నిజం!) ఆ నిజం తెలీక నేనేదో తప్పతాగి తప్పుచేసానని మీనాన్న నన్ను చితకబాదాడు.

సూర్య : ఏంటి మామయ్యా నువ్వనేది మానాన్న నిన్ను కొట్టాడా!

చల : అబ్బో అది పెద్దకతలే అల్లుడు! మనుష్యుల్లో మూడు రకాలుంటారు. ఒకటోరకం గోడకేసి కొడితే బంతిలా రివ్వున వెనక్కొస్తారు. రెండోరకం మట్టి ముద్దటైపు. కొట్టిన గోడకు అతుక్కుపోతారు. ఇక మూడో టైపు నాలాంటి వాళ్ళు రాయిలాంటివారు. మేం ఏంచేస్తామంటే కొట్టిన గోడనైనా బొక్కెట్టేస్తాం లేదా పెళ్ళున రెండుగా ముక్కలైపోయి మట్టిలో కలిసిపోతాం. నేను మట్టిలో కల్సిపోతానని మీనాన్న అనుకున్నాడు కానీ జీవితంలో డబ్బు సంపాయించేసి నిన్ను అల్లుడ్ని చేసేసుకొని మీ నాన్నకు బొక్కపెట్టేసాను... దటీజ్ చలపతి. ఇవన్నీ ఎప్పుడూ ఉండేవే గానీ – బంగ్లా ప్లానేమైనా ఉందా?

సూర్య : ఉంది మామయ్యా! (ప్లాను తీసి) ఇవి బెడ్‌రూమ్స్ – ఇక్కడ స్టైర్‌కేసు.... ఇక్కడ...

జగ : ఏరా... ఏదైనా కొంటున్నావా?

సూర్య : అవున్నాన్నా! ఇల్లు కొందామనుకుంటున్నాను.

జగ : మరి... నాతో ఒక్కమాటైనా చెప్పలేదేంట్రా....

సూర్య : చెబ్దామనే అనుకున్నాను... ఏదీ.... కుదిరిచావలేదు.

పార్వ : ఏమిటిరా కుదిరిచావనిది... ఒక ఇంట్లోవున్న మాకు చెప్పడానికి నీకు టైం దొరకలేదా... ఎక్కడోవున్న మీ మామగారికి చెప్పడానికి మాత్రం టైం దొరికిందా!....

జగ : అవునుమరి – వాడికి వాళ్ళ మామగారి మీదున్న అభిమానం, గౌరవం చాలా గొప్పవి కదా.

సూర్య : అంటే! నాకు మీ మీద అభిమానం గౌరవం లేదనా!...

జగ : ఆమాట నేనెందుకంటాన్రా... అన్నా నువ్వు ఒప్పుకుంటావా?...

సూర్య : చూశావా! అమ్మా–నాన్న యెలా మాట్లాడుతున్నాడో.

పార్వ : ఆయనన్నదాంట్లో తప్పేముందిరా! ఉన్నమాటేగా అన్నారు...

సూర్య : అమ్మా! నువ్వు కూడా నన్నే అంటున్నావా!... అవున్లే ఎంతైనా ఆయన సతీమణివిగదా! ఆయన్నే వెనకేసుకొస్తావు... ఎంతచేసినా ఆయన తర్వాతేగా నేను....

జగ : మాట వచ్చింది కనుక అడుగుతున్నాను... అసలేం చేశావురా నువ్వు... నీ అభివృద్ధి కోసం రెక్కలు ముక్కలు చేసుకున్న మా కోసం ఏంచేశావురా నువ్వు.

సూర్య : (నిజమే) మీరేం చేశారో చెప్పండి ఒక మేనమామ చదువు చెప్పించాడు... ఈ మేనమామ పిల్లనిచ్చి పోజిషనిచ్చాడు. తల్లిదండ్రులుగా మీరేం చేశారో చెప్పండి!....

చల : అల్లుడూ ఇలాటిప్రశ్నలు వేసేటైం కాదిది... అవతల నాకు బోలెడు పనులున్నాయి... త్వరగా బయల్దేరండి.

సూర్య : వెళ్దాం మామయ్యా! (లోపలికి చూస్తూ) ఇదిగో గణపతీ!

గణ : (గణపతి లోపల్నుంచి వస్తూ) అయ్యా.....

సూర్య : (మావయ్య బ్రీఫ్‌కేస్ కార్లో పెట్టు. నువ్వు కూడారా!) లోపల అమ్మగారు, అత్తయ్య ఉన్నారు పిలు!

గణ : అలాగే సార్.

సుజా : (సుజాత, రాజ్యాం వచ్చారు) – ఎందుకండి పిలిచారట?

సూర్య : మనం కొత్త బంగళా కొన్నాంగా అది చూడ్డానికి వెళదామంటున్నాడు మామయ్య!

**పార్వ** : (భర్తతో) ఏమండీ – మనమూ వెళ్ళిచూద్దామా...

**జగ** : ఆс – ఆс – తప్పకుండా

**సుజా** : అందరం వెళ్తే ఇంటికెవరు కాపలా వుంటారండీ. అసలే ఈ ఏరియాలే దొంగల భయం జాస్తి.

**గణ** : నేనుండిపోతాను... మీ రెళ్ళిరండమ్మా.

**సుజా** : నువ్విక్కడుంటే అక్కడేదైనా అవసరంవస్తే ఎవడు చేస్తాడు మీ అయ్యగారు చేస్తారా.... వాళ్ళయ్యగారు చేస్తారా....

**గణ** : మరెలాగమ్మా.

**సూర్య** : ఏమిటి సుజాతా! దీనికంత ఆలోచన... మనం వెళ్దాం... అమ్మానాన్న ఇంట్లో కాపలా ఉంటారు.

**జగ** : ఏంట్రా నువ్వనేది... మేము ఇంటికి కాపలాగా వుండాలా!....

**సుజా** : ఇందులో తప్పేముందీ... మీరంతకన్నా ఇంకోపని చేయలేరుగా...

**పార్వ** : సుజాతా!

**రాజ్య** : ఎందుకు వదిన అరుస్తావు. అమ్మాయన్నదీ నిజమేగా... ఈ వయస్సులో కృష్ణారామా అనుకుంటూ ఇంటికి కాపలాగా వుండకుండా షికార్లు తిరుగుతారా?...

**జగ** : రాజ్యం! ఏమన్నావమ్మా... క్రిష్ణారామా అనుకుంటూ ఇంటికి కుక్కలా కాపలా వుండాలా... నువ్వు నీ అన్నయ్య గురించి మాట్లాడే పద్ధతి యిదేనా?

**రాజ్య** : ఏం? అన్నయ్య అయితే నెత్తిన పెట్టుకోవాలి?....

**పార్వ** : నెత్తిన పెట్టుకోనక్కర్లేదమ్మా... ఈసడించకుండా వుంటే చాలు...

**సూర్య** : ఇందులో ఈసడింపేముందమ్మా... మనింటికి మనం కాపలా వుండటం తప్పా... అంతలోనే కుక్కలమైపోతామా!

**జగ** : ఒరే! ఒరే! మేము నీ తల్లిదండ్రులంరా... నీ యింట్లో వుండే పాత చెప్పులం కాదు...

**చల** : పాత చెప్పులైతే కనీసం బాత్‌రూంకి వేసుకెళ్ళడానికి పనికొస్తాయి. పాత బట్టలైతే ఎట్‌లీస్ట్ స్టీల్ సామాన్ల వాడికి వేయడానికి పనికొస్తాయి. కానీ ముసలాళ్ళయిపోయిన తల్లిదండ్రులు ఎందుకు పనికొస్తారు. కనీసం కుక్కల్లా కొంపకు కాపలా వుండటానికి పనికొచ్చారు అందుకు సంతోషించండి.

**జగ** : (కోపంగా – చలపతి చొక్కాపట్టుకున్నాడు) చలపతీ... (చెయ్యెత్తాడు.)

(సూర్యం జగన్నాథాన్ని లాగి అవతలికి తోశాడు. జగన్నాథం కిందపడ్డాడు)

సూర్య : (కోపంగా అరిచాడు) నాన్నా... నువ్వు మనిషివా పశువ్వా! నాయింట్లో నా ఎదురుగా నాకు పిల్లనిచ్చిన మామ మీద చేయి ఎత్తుతావా?...

పార్వ : వాడునీకు పిల్లనిస్తే – మేము నీకు జీవితాన్నిచ్చాంరా!

సూర్య : ఇచ్చార్లే బోడి జీవితం తాడూ బొంగరం లేని జీవితం... పంది పిల్లల్ని కని బురదలో పడేసినట్లు నన్ను మేనమామ ఇంట్లో పారేశారు...

సూర్య : పంది పిల్లకన్న హీనంగా వున్న నన్ను తీసుకొచ్చి ఉద్యోగం యిప్పించి, పిల్లనిచ్చి, సమాజంలో ఒక హోదా కల్పించాడు మామయ్య... తల్లిదండ్రులమని చెప్పుకోడానికి సిగ్గుండాలి మీకు...

గణ : ఏంటి సార్ ఇది.... దేవతల్లాంటి వారిని పట్టుకుని అలాటి మాటలనడానికి నోరెలా వచ్చింది సార్ మీకు.

సూర్య : ఛత్! నోర్మూయ్... సహిస్తున్నానని అన్నింట్లో కలుగ చేసుకోకు... వెళ్ళు... వెళ్ళి గదులన్నీ లాక్ చేసిరా... మనం వెళ్ళాలి.

గణ : అలాగే సార్. (గణపతి బెడ్రూంలోకి వెళ్ళాడు)

చల : ఆరోజు అలాగే నాతప్పేం లేకపోయినా చితగ్గొట్టాడు. ఈ రోజు అంతే!... తేడా ఏమిటంటే ఆరోజు వీళ్ళనాన్న సాక్ష్యం... ఈరోజు కొడుకు సాక్ష్యం.. తాత చేయలేని న్యాయం మనవడైనా చెయ్యాలిగద!

సూర్య : చేసి చూపిస్తాను వుండు మామయ్యా... ముసలాడికి తిండెక్కువై ఒళ్ళు తిమ్మిరిపట్టింది... వదిలిస్తా... (మీదికి వెళ్ళబోయాడు పార్వతి అడ్డుపడింది) అమ్మా! మర్యాదగా చెప్తున్నాను నువ్వు తప్పుకోమ్మా...

పార్వ : అంటే ఇప్పుడాయన్నేం చేస్తావురా (భయంగా)
(జగన్నాధం షాక్‌తో భయంతో చూస్తున్నాడు)

సూర్య : ఇదిగో! మామయ్య కాళ్ళుపట్టుకుని క్షమాపణ చెప్పు....

గణ : (వస్తూ) సార్ – సార్ – నామాట వినండి

సూర్య : రే! గణపతీ! వెళ్ళిక్కడ్నుంచి... (గణపతివంటింటి వైపు వెళ్ళాడు)

సుజా : అబ్బా ఊర్కోండి.... పదిమందికీ తెలిస్తే నవ్వుంటారు.

సూర్య : సుజాతా! నువ్వుండు ఇవాళ అటోయిటో తేలిపోవాలి.

రాజ్య : గట్టిగా కొట్టకండి బాబు! ముసలాడు చస్తే మళ్ళా లేనిపోని గొడవ.

సూర్య : (జగన్నాథంతో) చెప్పు.... క్షమాపణ చెప్పు... మామయ్యా ఇలారండి... (చలపతి వచ్చాడు) చెప్పు.. నువ్వు ముందు క్షమాపణ చెప్పు... చెప్పు (అరిచాడు)

**పార్వ :** (ఏడుస్తూ) నీకిది ధర్మం కాదురా!

**సూర్య :** నోరెత్తావో జాగ్రత్త!.... (పార్వతి షాక్) (జగన్నాథంతో) చెప్పు.... (చలపతి కాళ్ళమీదికి మెడబట్టి తోశాడు) నన్ను క్షమించుబావా అని చెప్పు...

**జగ :** (చలపతి కాళ్ళమీదపడి – తలెత్తి చూశాడు – తలవంచుకున్నాడు) నన్ను... నన్ను క్షమించు.. నన్ను క్షమించు చలపతీ...

**చల :** (చిద్విలాసంగా నవ్వాడు – కాలర్ పట్టి జగన్నాథాన్ని పైకి లేపాడు) ఇన్నాళ్ళకు నాకు చాలా హాపీగా వుంది బావా.. ఇరవై ఏళ్ళుగా నాలో రగులుతున్న పగ ఇవ్వాల్టితో చల్లారిపోయింది.. మనశ్శాంతిగావుంది... కొడుకు కొరగాని వాడని నువ్వనుకుంటున్నావ్... అతన్ని యోగ్యుడైన అల్లుడిగా నేను భావిస్తున్నాను... థాంక్స్ అల్లుడూ...

**సూర్య :** సుజాతా! పదండి వెళ్దాం... (గణపతి లోపలి నుండి వచ్చాడు. పార్వతి, జగన్నాథం ఓ పక్క నిలబడి వున్నారు ఒకరికొకరు ఓదార్చుకుంటూ... గణపతి జాలిగా చూస్తూ వెళ్ళాడు. ఆవెనక మిగిలినవాళ్ళు వెళ్ళిపోయారు)

**సూర్య :** గణపతీ! లాక్ చేశావా!...

**గణ (OBV) :** చేశాను సార్!

**సూర్య :** సుజీ!... మామయ్యా! అత్తయ్యా పదండి వెళ్దాం... (అందరూ బయటకు వెళ్ళారు. సూర్యం తల్లిదండ్రులను చూసి) మేయిన్ డోర్ లాక్ చేస్తున్నాను. మేము వచ్చేవరకూ ఆ వరండాలో కాపలావుండండి... ఇంట్లో పూచికపుల్ల పోయినా ప్రాణాలు తోడేస్తాను... (వెళ్ళిపోయాడు)

(పార్వతి జగన్నాథం వరండాలోకి వచ్చారు. జగన్నాథం వేదనగా పార్వతిని చూశాడు. ఆమె భోరున ఏడుస్తూ అతనిమీద వాలింది.)

**జగ :** ఎందుకే ఏడుస్తున్నావు... ఊc! ఎందుకేడుస్తున్నావు.

**పార్వ :** ఏవండీ....

**జగ :** ఇప్పుడు మనం కుక్కలం. కుక్కలు ఏడవ్వు. అరుస్తాయి... బౌ..బౌ...బౌ....

**పార్వ :** (నిశ్చేష్ఠురాలై చూస్తోంది)

**జగ :** దొంగవచ్చి దోచుకుపోకుండా కాపలా కాస్తాను. బౌ...బౌ...బౌ... నువ్వు కూడా రా! ఎవరైనా వస్తే వాళ్ళ మీద పడి కరువు. రా! రా! బౌ... బౌ... (నాలుక కింద సాగదీసి ఝూ పోసిపోతూ చేతుల్ని ముందరి కాళ్ళలాగా చేసి కుక్కలాగా అరుస్తున్నాడు)

**పార్వ :** (కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది.)

# నాల్గవ రంగం

(అదే ఇల్లు – ఇప్పుడు జగన్నాధానికి ఎనభైఏళ్ళు పైబడ్డాయి. పార్వతమ్మ ఫోటోకి దండ వేసి ఉంది. గణపతి మందులు తీసుకొని వచ్చాడు. లోనకు వెళ్తుండగా... (ఫోను రింగవుతోంది.)

**గణ** : అబ్బబ్బ! ఈ ఫోనొకటి చెవిలో జోరీగలాగా – తీస్తే ఎందుకు తీశావంటారు. తియ్యకపోతే ఎందుకు తియ్యలేదంటారు. తియ్యాలో వద్దో తెలీదు....

(లోనుండి ఎవరైనా వచ్చి తీస్తారేమోనని చూశాడు – ఇక తప్పదన్నట్టు తీశాడు) హల్లో!... ఎవరండీ మాట్లాడేది?... మీరు చెప్పండి మీరెవరో? అవును ఇది 27364891. జూబ్లీహిల్స్‌లో రోడ్ నెం. 26 ఉంది. అక్కడ...ఆ...ఆ.. ఆ బిల్డింగ్ మాదే... అవును... టులెట్ బోర్డు పెట్టాం. అద్దెకివ్వాలనే కదండీ బోర్డుపెట్టాం... ఎంతంటారా? ఉండండి ఓనర్ని. పిలుస్తాను... నేనా? నౌకర్ని... (ఫోను పక్కన పెట్టి)... (లోనకు చూశాడు లోనుండి ఏదో అరుపులు వినిపిస్తున్నాయి) అమ్మో లోపల స్టంట్ సీను జరుగుతున్నట్టుంది. ఇప్పుడొద్దు (మళ్ళీఫోనులో) హలో! మీకు నిజంగా ఇల్లు అద్దెకు కావాలండీ! అయితే ఈవినింగ్ చల్లని వేళప్పుడు ఫోన్జెయ్యండీ... ఇప్పుడు గనక మాట్లాడితే మీ ప్రతిమాటకు అడ్డంజెబుతాడు. ఎందుకంటే మా అయ్యగారు పూర్వజన్మలో మిలట్రీవాడయ్యుంటాడండి! ఈ జన్మలో కూడా ఆ వాసనలు ఇంకా ఉండిపోయాయండి. అందుకే అతనికి ఇంట్లో ఉన్నపుడు భార్య బిడ్డలు శత్రువుల్లాగ కనిపిస్తారండీ? ఫ్యాక్టరీ కెళ్ళరనుకోండి సిబ్బంది పరమశత్రువుల్లాగ కనిపిస్తారండీ! అతను ఇంట్లోవున్న, ఆఫీసులోవున్న నిత్యమూ శత్రువుగా చూసే మరోవ్యక్తి ఉన్నారండీ. అతనెవరా? వాళ్ళ నాన్నగారండీ. సరే అవన్నీ మీ కెందుక్కాని ఇప్పుడయ్యగారి మూడ్ బాగోలేదు. సాయంత్రం ఫోన్ చేయండి. (ఫోను పెట్టేసి లోనకు వెళ్ళాడు. మరో పక్కనుండి సుజాత, సూర్య ప్రకాష్ వచ్చారు. ఆమె చేతిలో ఓ గ్లాసుంది)

**సుజా** : అబ్బబ్బ – నామాట వినండి. ఇది తాగండి.

**సూర్య** : నేను తాగను. తాగను – తాగను –

**సుజా** : తాగకపోతే ఇంకా నీరసమొస్తుంది.

**సూర్య** : వస్తే ఏకంగా ఛస్తాను. కానీ ఈ రాగిగంజి మాత్రం తాగను.

**సుజా** : జబ్బులన్నవి మనుష్యులకు కాకపోతే మానులకి వస్తాయా?

**సూర్య** : నేను అందర్లాటి మనిషిని కాను. నాది రాయిలాంటి బాడీ. ఒకపక్క యోగ చేస్తున్నాను. మరోప్రక్క ఎక్సర్‌సైజ్ చేస్తున్నాను. ఏ చెడ్డ అలవాట్లు లేవు. నాకు షుగర్ రావడమేమిటి? నాకు బి.పి. రావడమేంటి? నువ్వేదో కుట్ర

చేయకపోతే!

**సుజా :** ఉరుమురిమి మంగళం మీద పడ్డట్టు - మీకు జబ్బులొస్తే నేను కుట్ర చేశానంటారేంటి?

**సూర్య :** షటప్ మాటకు మాట ఎదురు జవాబివ్వద్దు.

**సుజా :** అరే.... ఎందుకలా అనవసరంగా బి.పి. పెంచుకుంటారు.

**సూర్య :** టెన్షన్... బిజినెస్‌లో ఎంత టెన్షనో తెల్సా? నీతో అవన్నీ చెప్పగల్నా! చెప్పినా నీకేవయినా అర్థమవుతాయా? అవుతాయా? కావు... ఇల్లనేది బయటపడే బాధలన్నీ మరిపించే ఎయిర్ కండిషనర్‌గా ఉండాలి కానీ నువ్వు... ఇంటిని నిప్పులు కురిపించే అగ్ని గుండంలా మారుస్తున్నావు. ఏం చెయ్యమంటావు నన్ను... చెప్పు... చెప్పు.... ఏం చెయ్యమంటావు.

**సుజా :** (మూడ్ మార్చే ధోరణిలో) ఒకే... ఒకే - మీ బి.పి.కి - ఈ కోపానికి కారణం నేనే... ఒప్పుకున్నానుగా.. యిక అట్టే మారాం చేయకు. ఈ రాగ్‌మాల్ట్ తాగండి - (గ్లాస్ అందివ్వబోయింది)

**సూర్య :** వద్దని చెప్పానా....

**సుజా :** (గోముగా) ప్లీజ్ - మావారు చాలా మంచివారట ఎంచక్కా నామాట వింటారుట -అబ్బ - ప్లీజ్.

**సూర్య :** (చల్లబడి) ఊ - చల్చాల్లే - ఇదోటి నేర్చావు. (గ్లాసు తీసుకు గట గటా తాగాడు)

**సుజా :** గుడ్ హజ్బెండ్! (నవ్వుతూ గ్లాస్ తీసుకొని లోపలికి వెళ్ళబోయింది. లో నుండి జగన్నాథం అరుస్తున్నాడు)

**జగ :** పిల్లలెక్కడ్రా!

**గణ :** స్కూలుకెళ్ళారు. వచ్చాక తీసుకొస్తాను.

**జగ :** రెండు రోజులనుండి ఇదే చెబుతున్నావ్.

**సుజా :** సరిపోయింది. కొడుకుగారు చల్లబడ్డారో లేదో అయ్యగారి గోలమొదలు.

**సూర్య :** ఊం!

**సుజా :** రోజూ ఆ ముసలాడిదగ్గరకు పిల్లలు వెళ్ళకుండా ఆపడానికి నానా తంటాలు పడ్తున్నాను. ఇక నావల్లకాదు. పిల్లల్ని ఏదైనా హాస్టల్లో పెట్టండని ఎన్నిసార్లు చెప్పాలి మీకు.

**సూర్య :** నేను ఆల్రెడీ రెసిడెన్షియల్ స్కూలు ప్రిన్సిపాల్‌తో మాట్లాడాను. వాళ్ళఫోను కోసమే వెయిట్ చేస్తున్నాను. (లోనుండి గణపతి వచ్చాడు)

**గణ :** సార్.

సూర్య : ఏం?

గణ : నాన్నగారు పిల్లల్ని చూస్తామంటున్నారు.

సుజా : వీల్లేదు.

గణ : తప్పమ్మా! అలా అనకండి.

సూర్య : ఏంటయ్యా తప్పు. చిన్న పిల్లల్ని దగ్గరగా తీసుకొని ముద్దులు పెట్టేస్తుంటే ఆ ముసలాడి జబ్బులవి పిల్లలకి అంటుకోవా!

గణ : మీరు పెట్టుకోవట్లేదా సార్!

సూర్య : నాకూ, ఆ ముసలాడికి ఒకటేనా! నేను వాళ్ళ కన్నతండ్రిని.

గణ : అతను మిమ్మల్ని కన్నతండ్రి కదా సార్.

సూర్య : కావచ్చు – నా పిల్లలు – నా ఇష్టంవచ్చినట్టుండాలి.

గణ : చూడండిసార్ – పిల్లలు మనం అనుకున్నట్టుండరు సార్. మనం ఉన్నట్టే ఉంటారు.

సుజా : ఇదిగో నీవల్లే ఆ ముసలాడు పెంకిగా తయారయ్యాడు. అక్కడికేదో నీకే ప్రేమున్నట్టు – మాకు లేనట్టు.

గణ : సార్! పిల్లల్ని చూడందే టిఫిన్ తినని మారాం చేస్తే ఎలాగోలా బ్రతిమాలితే కాసిన్ని మొలకలు తినడానికి ఒప్పుకున్నారు. ఈ రోజు ఎలాగైనా పిల్లల్ని ఒక్కసారి అతని దగ్గరకు తీసుకుపోతాను సార్!

సూర్య : అలాగే!

గణ : థాంక్స్ సార్ (గణపతి ఆనందంగా లోనకు వెళ్ళిపోయాడు)

సుజా : మీరు దేంట్లో ఎలా ప్రవర్తించినా సహిస్తాను. కానీ పిల్లల విషయంలో నామాట వినకపోతే మాత్రం ఒప్పుకోను.

సూర్య : ఎందుకలా అరుస్తావ్.

సుజా : మీ బి.పి. నాకొచ్చేలావుంది. పిల్లల్ని అతని దగ్గరకు మళ్ళీ పంపే ప్రసక్తిలేదు ఒళ్ళంతా పుచ్చిపోయింది. పెద్దవాళ్ళకే కడుపులో దేవినట్టయిపోతాది.. అలాంటిది పిల్లలు... వాళ్ళనెలా పంపిస్తామండి... రేపేదైనా అయితే...!

సూర్య : ఒక్క రోజు ఆగు

సుజా : ఒక్క క్షణం కూడా ఆగను. వాళ్లు స్కూలు నుండి అటునుండి అటే హాస్టల్‌కి వెళ్ళిపోవాలి.

సూర్య : అబ్బా! చంపుతున్నావుకదే! అన్నిటా మీ అమ్మమ్మపోలికే.

సుజా : ఏవన్నారు?

**సూర్య :** అహా ఏం లేదు. మా నాన్నమ్మలాగా చాలా అందంగా ఉన్నావంటున్నాను.

**సుజా :** చాల్లెండి – ముందు ఫోన్ చేయండి.

**సూర్య :** చంపుతున్నావుగదే... (ఫోను డయల్ చేస్తున్నాడు అప్పుడే గణపతి జగన్నాథంని చేయిపట్టుకొని తీసుకువచ్చి ఒక కుర్చీలో కూర్చోబెట్టాడు. తన చేతిలోని చిన్న కప్పుని జగన్నాథం చేతిలో పెట్టాడు. ఆ కప్పులోని మొలకలు ఒక్కొక్కటి తింటూ గట్టిగా వున్నవాటిని టేబుల్ మీద పెట్టి అక్కడ దొరికిన గరిటితో చితక్కొట్టి నోట్లో వేసుకొని తింటున్నాడు. కళ్ళల్లో చూపు కొడగట్టకుపోతున్నట్టుంది. చర్మమంతా పాలిపోయి, పేలిపోయి పొరలు పొరలుగా ఊడి వస్తున్నట్టుంది. ఒంటిమీద ఉన్న పుండ్లకి రసికారుతుంది. వాటిమీద ఈగలు వాలుతుంటే వాటికి అప్పుడప్పుడూ తోలుకుంటున్నాడు. ఈ చేష్టలు చేస్తున్నప్పుడు ఒక కోతిని తలపింపచేస్తున్నాడు–)

**సూర్య :** (ఫోనులో) ప్రిన్సిపాల్‌గారున్నారా! నేను సూర్యప్రకాష్‌ని. ఆ! ఆ! వచ్చిన వెంటనే నాతో మాట్లాడమని చెప్పండి! (ఫోను పెట్టేసి) ఇప్పుడే బయటకు వెళ్ళారట.

**సుజా :** మీరేం చేస్తారో తెలీదు. ఈ రోజు వాళ్ళిక్కడకు రాకూడదు అంతే.

**సూర్య :** నాకు నువ్వు వార్నింగ్‌లు ఇవ్వొద్దు.

**సుజా :** మీరు మాత్రం వార్నింగ్‌లు, పనిష్మెంట్‌లు అన్నీ ఇవ్వొచ్చు. ఏం...

**సూర్య :** మాటకు మాట పెంచొద్దు.

**గణ :** సార్!....

**సూర్య :** తమరి ఉవాచ ఏంటో?

**గణ :** ఉద్యోగం, సంసారం, సమాజం ఇవన్నీ బురదగుంటలు! వాటిలో దిగబడక తప్పదు. అయితే బురద అంటుకోకుండా బ్రతకడమే నేర్పు.

**సూర్య :** నన్నోమాట చెప్పమంటావా?

**గణ :** చెప్పండి సార్!

**సూర్య :** సూటిగా అంటే అది శాపమైనా సరే హాయిగా వినొచ్చు. ఎత్తిపొడుపు అయితే వేదం చెప్పినా వెగటుగానే ఉంటుంది. చెప్పేదేమైనా ఉంటే తిన్నగా తగలడు.

**గణ :** అయితే చెబుతాను వినండి! జీవితమనేది ఆటైతే ఆ ఆట మీకురాదు – లైఫ్‌ని ఒక సంగీత కచేరీగా భావిస్తే దాని తాళం మీకు తెలీదు – బ్రతుకనేది ఒక నృత్యం అనుకొంటే దాని భంగిమలు మీకు అర్థం కాదు.

**సూర్య :** చెప్పుచ్చుకొడతాను.

**గణ :** అదొక్కటే మీకు తెల్సు – అనుకుంటారు. చాలాసార్లు మిమ్మల్ని మీరే

కొట్టేసుకొని అవతలివాడ్ని కొట్టానని ఫీలైపోతుంటారు. నీతులు చెప్పగలిగే సమర్థతకన్నా వినగలిగే సహనం గొప్పది సార్.

**సూర్య :** ఒరేయ్! నీకు మాట లెక్కువైపోతున్నాయి. మర్యాదగా నోర్మూసుకొని బయటకుపోఁ!

**సుజా :** వాడిమీదెందుకు విరుచుకుపడతారు. వాడేం తప్పుగా మాట్లాడలేదు.

**సూర్య :** వాడ్ని ఇంట్లో నుంచి గెంటేయమని శతపోరావు. ఇప్పుడు వాడు మంచివాడయిపోయాడా!

**సుజా :** ఇందులో మంచి చెడ్డేముందండీ! మీ అమ్మ బ్రతికున్నన్నాళ్ళూ నాకు వాడి అవసరం లేకపోయింది. మీ అమ్మ పోయాక నాక్కాస్త సహాయం చేస్తున్నాడు కాబట్టి వాడిని సమర్థిస్తున్నాను. (ఇంతసేపూ జగన్నాథం ఆ కప్పులోనివి తినుకుంటూ వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో కొంచెమైనా వినాలని ప్రయత్నించాడు. అతికష్టం మీద మీ అమ్మ పోయాక అన్నమాట వినబడింది.)

**జగ :** ఏంట్రా... అమ్మ అని ఏదో అంటున్నారు?

**సూర్య :** ఆ... ఏంటి?

**జగ :** అమ్మ

**సూర్య :** అమ్మో! బొమ్మో! నీకెందుకు మధ్యలో నోర్మూసుకొని కూర్చోకుండా.

**జగ :** ఏంటీ?

**గణ :** (దగ్గరకెళ్ళి చెవిదగ్గర గట్టిగా చెప్పాడు) నీకెందుకన్ని విషయాలు. నోర్మూసుకొని కూర్చోమంటున్నాడు నీ కొడుకు.

**జగ :** నేటికయిదు సంవత్సరాల నుంచి కూర్చునే ఉన్నాను. వాడ్ని వాడి పెళ్ళాన్నేమయినా అంటున్నానా?

**సుజా :** చూశావా ముసలాడు నా మీద ఎలా పడుతున్నాడో.

**సూర్య :** అబ్బ ఎందుకలా అరుస్తావ్? ముసలోడితో మనకెందుకు గొడవ.

**సుజా :** ముసలాడయితే ముసలాడిలా ఉండాలి!

**సూర్య :** ఆ ఇప్పుడు నిన్నేమన్నాడు!

**జగ :** అదిగో ముసలోడ్నని మీద మీదకు రాకు. మర్యాదగుండదు.

**సుజా :** అబ్బ! ఖర్మ! ఖర్మ! చచ్చిపోతున్నాను.

**జగ :** నువ్వేం నుదురుబాదుకొని నన్ను తిట్టిపోయక్కర్లేదు. మీరేం ఎల్లకాలం యిలాగే ఉండిపోరు. వయసు మీకూ వస్తాది. అప్పుడు నాకన్న మీరు ఎక్కువే...!

**సుజా :** ఏంటి ఎక్కువ?

జగ : ఓరి చాతకానోడా! నీ పెళ్ళాన్ని పుర్రెక్కించి నన్ను కొట్టమని పంపిస్తావా? ఏది నువ్వు కొట్టు. వస్తున్నాను. (అంటూ పైకి లేచాడు – వెంటనే మూత్రం అయిపోయింది)

సుజా : ఛీ ఛీ ఛీ! యిళ్ళంత కంగాళి చేశాడు – గణపతీ! ఆ దరిద్రాన్ని కడిగి శుభ్రం చెయ్.

సూర్య : (గబగబ వచ్చి ముసలాడి రెక్కపట్టుకొని ఈడ్చుకెళ్తు) రా! రా! ఇల్లంతా గబ్బు గబ్బు చేస్తున్నావ్.

జగ : ఉండు! నా గిన్నుండిపోయింది.

గణ : (మూత్రం పడిన స్థలం శుభ్రం చేస్తున్నాడు)

సూర్య : అది తర్వాత చేద్దువ్‌గానీ ముందీయన్ని లోపలికి తీస్కెళ్ళు.

(గణపతి జగన్నాథం దగ్గరకు వస్తున్నాడు.)

జగ : గణపతీ! ఆ గిన్నె తీసుకురా!

సూర్య : తీసుకొస్తాడులే. కాటికి కాళ్ళు చాపుతున్నా కడుపుకు మాత్రం తక్కువ చెయ్యవు కదా! (గణపతి జగన్నాథంని తీసుకొని లోపలకు వెళ్ళాడు.)

సూర్య : వద్దురా నాయనా! పగవాళ్ళకు కూడా ఈ శిక్ష వద్దు.

(చలపతిరావు బయటనుండి అమ్మాయి – అమ్మాయి అని పిల్చుకుంటూ వచ్చాడు)

సుజా : నాన్నా! ఎప్పుడు రావడం? – అలా వున్నావేవిటి నాన్న

చల : అవన్నీ తర్వాత చెబ్తాకానీ, ముందు ఒక యాభై రూపాయలుంటే ఇవ్వు.

సుజా : ఎందుకు నాన్న!

చల : ప్చ్. చెబుతాను. ముందివ్వమ్మా!

సుజా : ఇస్తాను సరే! నీ దగ్గర యాభై రూపాయలు లేకపోవడమేమిటా అని.

(వీళ్ళిలా మాట్లాడుతుండగా సూర్యప్రకాష్ బయటకు చూసి పరిస్థితిని అర్థం చేసుకున్నాడు)

చల : లేవని నేనన్నానా? చిల్లర లేదంతే!

సుజా : అదా! ఏవండీ – ఓ యాభై ఇవ్వండి. (యాభై రూపాయలు భర్త దగ్గర తీసుకొని ఇచ్చింది. ఆ డబ్బులు తీసుకొని చలపతి బయటకు వెళ్ళబోతున్నాడు)

సూర్య : ఎవరికి మావయ్యా ఆ డబ్బులు?

చల : ఇది.... ఇది... బయట ఆటోవాడికివ్వాలి. (బయటకెళ్ళాడు)

సూర్య : ఆటోవాడికా?

సుజా : నాన్న ఆటోలో రావడమేమిటి? ఆయన కారేమయింది మరి?

సూర్య : దారిలో ఏమయినా రిపేరొచ్చిందేమో?

చల : (వస్తూ, బరస్టయిపోయి) నా లైఫే రిపేరయింది బాబు.

సుజా : ఏమైంది నాన్నా?

చల : అమ్మా! ఎంత ఆస్థి సంపాదించాను? మేడలు, కార్లు, డబ్బు, బంగారం అంతా నా సంపాదనే గదమ్మా!

సుజా : కాదని ఎవరన్నారు నాన్నా?

చల : నాదొక్క పూచిక పుల్లయినా మీకిచ్చానా అల్లుడూ?

సూర్య : ఏం జరిగిందని ఇంత బాధపడ్తున్నారు చెప్పండి?

చల : మా ఆస్తంతా మీ దగ్గర దాచేశానని నా కొడుకంటాడు. (కూతురుతో) నువ్వడిగినప్పుడల్లా నీకు దోచిపెడుతున్నాని నా కోడలంటుంది. ముసలాడ్ని కనీసం జాలి అయినా పడకుండా కట్టుబట్టల్తో ఇంటిలో నుంచి గెంటేశారమ్మా!

సుజా : అంతపని చేశారా? వాళ్ళకేమయినా పుట్టగతులుంటాయా?...

చల : మీ అమ్మపోయాక ఆ ఇంట్లో నాకు మనశ్శాంతి కరువైందమ్మ! అందరూ ఉండికూడా ఎవరూ లేని ఒంటరి వాడినయ్యాను.

సుజా : సరే. వాళ్ళునిన్ను కాదంటే మాత్రం నేను లేనా నిన్ను చూసుకోడానికి.

సూర్య : నువ్వుండమంటే మాత్రం కూతురింట్లో ఉండనికి మీ నాన్నేమీ సిగ్గూ శరమూ లేనోడు కాదు.

సుజా : అంటే మా నాన్న ఇక్కడ ఉండకూడదనా మీ ఉద్దేశ్యం?

సూర్య : చూడూ! ఆ ఫోటోలో ఉన్న మా అమ్మ నెలకోసారి పిడికెడన్నం పెట్టమందనుకో! ఆ ఫోటో తీసి అవతల పారేస్తాను. దటీజ్ సూర్యప్రకాశ్. (చలపతితో) నీవు నేర్పిన విద్యయే!

సుజా : ఇదిగో! నామాటకడ్డు చెప్పకండి. మీ నాన్న లేడా? మీ నాన్నతోపాటే మా నాన్నా ఉంటాడు.

సూర్య : మా నాన్న ఉన్నాడు కాబట్టే మీ నాన్నను వద్దంటున్నాను.

చల : అల్లుడూ! నీ కాళ్ళు పట్టుకుంటాను, నీ ఇంట్లో నాకింత చోటివ్వు!

సూర్య : ఊహుఁ! కుదరదు.

చల : నేనేమీ ఎక్కువ తినేయనల్లుడూ? ఒక్క పూట భోజనం పెడితే చాలు. మీ ఇంట్లో కాపలా కుక్కలా పడి ఉంటాను.

సూర్య : ఇప్పుడు ఇంట్లో ఆల్రెడీ ఒక కోతి వుంది. దాంతోనే పడలేక ఛస్తున్నాం. మళ్ళీ నువ్వు కుక్కలాగుంటావా? వద్దొద్దు.

సుజా : ఆయన్ను బ్రతిమిలాడేదేంటి నాన్నా! నువ్వు కూడా ఉంటున్నావ్! అంతే!

సూర్య : ఒసేయ్! నీ ఇష్టం వచ్చిన నిర్ణయాలు తీసుకోకు.

సుజా : ఏం! ఎందుకు తీస్కోకూడదు. మీ నాన్న ఉంటే మా నాన్న ఉంటాడు. మీ నాన్నని బయటికి పంపించినప్పుడు మా నాన్న బయటకుపోతాడు.

సూర్య : నేన్జెప్పింది అర్థం చేసుకోకుండా మాట్లాడకు. నువ్విలారా! చెప్తా! (కాస్త దూరం తీస్కెళ్ళి నెమ్మదిగా చెప్పాడు) మీ నాన్న ఇక్కడే వుంటాడు. కానీ ఇప్పుడు కాదు. మా నాన్న పోయాక.

సుజా : మీ నాన్నిప్పుడిప్పుడే పోడు.

సూర్య : ఎప్పుడు పోతే అప్పుడు.

సుజా : సరే! ఒక పన్జేద్దాం! కూతుర్ని ఉన్నాననే ఆశతో వచ్చాడు. వెంటనే పంపించేస్తే ఏం బాగుంటుంది? ఒక్క రెండు రోజులుంచి పంపించేద్దాం ప్లీజ్.

సూర్య : అలాగే! కానీ రెండు రోజులంటే రెండ్రోజుల్లోనే పంపించేయాలి. (లోనకెళ్ళాడు)

సుజా : అలాగే (చలపతి దగ్గరకెళ్ళి) మీ అల్లుడ్ని అపార్థం చేసుకోవద్దు నాన్నా! ఆయనుద్దేశ్యం ఏంటంటే వాళ్ళ నాన్నవల్ల నువ్వెక్కడ ఇబ్బంది పడతావోనని నిన్ను వద్దంటున్నాడు. ఆయన పోయాక ఇక్కడు ఉండమంటున్నారు.

చల : ఆయన పోయాక! అందాక నా గంతేటమ్మా!

సుజా : అన్నిటికీ తొందరే. ముందు మీరు స్నానం చేసిరండి నేవెళ్ళి టవల్ తెస్తాను (గదిలోకి వెళ్ళింది. చలపతి లోనకెళ్తున్నాడు. లోనుండి జగన్నాథం రెక్కపట్టుకొని గణపతి తీసుకొస్తున్నాడు. చలపతి రోతగా చూస్తూ పలకరించకుండా వెళ్ళిపోవాలనుకున్నాడు)

జగ : ఎవడువాడు దుక్కలాగున్నాడు?

గణ : మీ చలపతి బావ!

చల : (పలకరించకపోతే బాగుండదనిపించి) ఏంబావా బాగున్నావా?

జగ : (అలా నిలబడి చూస్తున్నాడు)

గణ : (చెవిలో) బాగున్నావా అని అడుగుతున్నాడు.

జగ : ఆఁ. ఆఁ. (చలపతి లోనకెళ్ళిపోయాడు – జగన్నాథంను కుర్చీలో కూర్చోబెట్టాడు)

సుజా : (వస్తూ) యిదిగో నాన్నా (టవల్‌తో వచ్చింది.)

జగ : (దగ్గరకి రమ్మని చేతితో సైగచేశాడు. గణపతి దగ్గరకు వచ్చాడు) వీడొట్టి దగుల్బాజీ! వచ్చినప్పుడల్లా వేలకు వేలు కూతుర్నడిగి మోసుకుపోతుంటాడు.

(ఆ దగ్గర్లో వున్న సుజాత సర్రున జగన్నాధం మీదకు దూసుకువెళ్ళి)

**సుజా** : ఏంట్రా ముసలాడా! (ముసలాడ్ని ముందుకు నెట్టింది. అమ్మా! అని డబ్బున పడిపోయాడు) నీ నోరెలా తిరుగుతుందని.

**గణ** : అరె! ఏం మనిషివమ్మా నువ్వు! ముసలాడ్ని అంతలా తోసేస్తావా?

**సుజా** : తొయ్యడమా? గొయ్యి తీసి పాతెయ్యాలి.

**గణ** : ఆపన్జెయ్యమ్మా! ప్రాణానికి హాయిగా ఉంటుంది.

**జగ** : (నిర్భలత్వంతో కూడిన ఏడుపు ఏడుస్తూ, గణపతి నడుంకి చట్టుకుపోయాడు) గణపతీ!

**గణ** : ఛ! ఛ! ఊర్కోండిసార్! ఏంటి చిన్నపిల్లాడిలాగ... నేనున్నాను కదా!

**జగ** : చూశావా ఎలా గీరుకుపోయిందో! (సుజాత గణపతి వంక చూసి మూతి మూడు వంకర్లు తిప్పుతూ లోనకు వెళ్లింది – చలపతి వచ్చాడు)

**గణ** : ఉండండి మందు రాస్తాను (లోనికి వెళ్ళాడు –)

**చల** : (జగన్నాధంతో) గీజర్ పన్జెయ్యడం లేదా?

**జగ** : ఆఁ.... మీ అమ్మాయే తోసేసింది.

**చల** : ఇదో చెవిటిమేళం... (సూర్యం లోనుండి వచ్చాడు. జగన్నాధం నెమ్మదిగా దేక్కుంటూ గుమ్మం వరకెళ్ళి బయటకు తొంగిచూస్తున్నాడు.)

**సూర్య** : చల్లని నీళ్ళు చేసెయ్యండి మామయ్య! గీజర్ పాడైపోయింది.

**చల** : నాక్కూడా చల్లని నీళ్ళే ఇష్టం... అమ్మాయి వేన్నీళ్ళు చెయ్యమంటేను,

**సూర్య** : దానిదేం పోయింది. కరెంటు బిల్లు కట్టేది నేను కదా! (వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు. ఫోను డయల్ చేస్తున్నాడు.)

**చల** : బిల్లుదేముంది అల్లుడు ఒళ్ళు చూసుకోవాలిగానీ!
ఒంటికి చల్లని నీళ్ళే మంచిది. (గణపతి ఆయింట్‌మెంట్‌తో వచ్చాడు)

**గణ** : ఊ ఊ కానివ్వండి... (జగన్నాధం గుమ్మం దగ్గర ఉండటం చూసి) అరెరె! అక్కడకెందుకెళ్ళారు సార్.

**జగ** : పిల్లలొస్తున్నారేమోనని! వాళ్ళకు ఈ రక్కులు చూపిస్తాను.

**గణ** : ఉండండి! ఆయింట్‌మెంట్ రాస్తాను.

**సూర్య** : హలో... ప్రిన్సిపాల్ గారున్నారా? లేరా... ఎప్పుడొస్తారు.. సరే.. సరే
(ఫోన్ పెట్టేసి పేపర్ తీసుకున్నాడు)

**గణ** : (గట్టిగా) సార్! అన్నం తినేస్తారా!

**జగ** : పిల్లలు రానీ!

సుజా : (స్పీడుగా వచ్చింది) పిల్లలు రాకపోతే ముద్దదిగదా!

గణ : అదేంటమ్మా! అలా అంటావ్. పిల్లలంటే వారికి ప్రాణం కదమ్మా!

సుజా : ఆఁ! మాకూ ప్రాణమే. ఈ రోజునుండి ఆయనగారు మన పిల్లల్ని చూడడానికి, వాళ్ళతో మాట్లాడడానికి, వాళ్ళను దగ్గరకు తీసుకోవడానికి వీల్లేదు. చెబుతున్నాను.

జగ : ఏవిటీ... అంటోంది.

గణ : ఏవీ లేదు సార్. (సుజాతతో) అమ్మా! గట్టిగా అనకండమ్మా! ఆ మాటవిని తట్టుకోలేరమ్మా.

సుజా : ఆ రోగిష్టి మనిషి దగ్గర మా పిల్లలు ఉండటం చూసి మేమూ తట్టుకోలేం.

గణ : ముసలివాళ్ళు పసివాళ్ళతో సమానమమ్మా!

సూర్య : (అసహనంగా) ఏంట్రా మళ్ళీ లెక్చరిస్తున్నావు.

గణ : చూడండి సార్! నాన్నగారు పిల్లల్ని చూడడానికి వీల్లేదంటుంది అమ్మ.

సూర్య : అవును నీకేవిటి బాధ.

గణ : మీరు కూడా అలా అంటే ఎలా?

సూర్య : నేనేకాదు. బుద్ధి, జ్ఞానం ఉన్న ఎవడైనా అలానే అంటాడు.

గణ : అవి ఉన్న వాడెవడూ అలా అనడు.

సూర్య : పళ్ళు రాలగొడతాను జాగ్రత్త.

గణ : మీరేంచేసినా పిల్లల్ని అతనికి చూపించకుండా ఉండను.

సుజా : చూశారా వీడి పొగరు. అందుకే హాస్టల్‌లో చేర్పించండని చెబుతున్నాను.

సూర్య : ప్రిన్సిపాల్ కోసం మళ్ళీ ట్రైచేస్తానుండు. (ఫోన్ దగ్గరకు వెళ్ళి డయల్ చేస్తున్నాడు.)

గణ : సార్ వద్దుసార్. పిల్లల్ని హాస్టల్లో చేర్పించకండి సార్.
సార్.... సార్ మీకు దండంపెడతాను సార్.

జగ : (ఏదో గొడవ జరుగుతున్నట్టు అర్థమైంది) ఏంటి గణపతీ ఏవయ్యింది....?

గణ : (గట్టిగా) పిల్లల్ని హాస్టల్లో చేర్పిస్తున్నారు.

జగ : ఆఁ!.... అయితే పిల్లలు నాకు కనిపించరా!

సుజా : కనిపించకపోతే కొంపలేమి మునిగిపోదులే.

గణ : పిల్లల్ని చూడకపోతే ఆ ముసలి ప్రాణం ఎంత గిలగిలలాడిపోతుందో – నీకెలా తెలుస్తుంది – జాలీ – దయా లేనిదానివి....

సూర్య : (కోపంగా మీద కొచ్చాడు) ఏంట్రా ఆ ఏకవచన ప్రయోగం –

గణ : అంతకన్నా నీచమైన ప్రయోగం తెలీక.

సూర్య : యూ రాస్కెల్! (కొట్టాడు) (అప్పుడే చలపతిలోనుండి బయటకొచ్చి అంతా గమనిస్తున్నాడు)

జగ : ఎందుకలా కొడుతున్నావురా (లేవబోయి పడిపోయాడు)

గణ : సార్ నన్ను కొడితే కొట్టండి పిల్లల్ని మాత్రం అతనికి దూరం చెయ్యకండి సార్.

సూర్య : నువ్వెవడవిరా ఆ మాట చెప్పడానికి.

సుజా : ఏదో నమ్మకంగా పనులు చేస్తున్నావని చనువు ఇస్తే, ఆఖరికి మేమంటే లెఖ్ఖ లేకుండా పోయిందా!

చల : ఇలాంటి వాడ్ని ఇంట్లో పెట్టుకోవడం మీ తప్పు.....

సూర్య : ఏదో పెద్దవాడివి కదా అని – ఇన్నాళ్ళూ సహిస్తూ వచ్చాను. ఆఖరికి ఇంట్లో ఆడవాళ్ళనే అగౌరవంగా మాట్లాడేస్థితికి వచ్చావు. ఇక నిన్ను ఇంట్లో ఉంచుకోకూడదు.

చల : ఇది కరక్టు... (లోనకెళ్ళాడు)

సూర్య : పో బయటకు... పోరా... (జుత్తు పట్టుకొని బయటకు ఈడ్చేస్తున్నాడు)

గణ : సార్! ప్లీజ్ సార్! నాన్నగార్ని వదిలి వెళ్ళలేను సార్. నేను వెళ్ళిపోతే అతను అనాధ అయిపోతాడు సార్!

సుజా : అంటే మేమంతా చచ్చినట్టా?

గణ : నా ఉద్దేశ్యం అది కాదమ్మా! మొదట్నుంచి ప్రతీ చిన్న విషయానికి నన్నే పిలుస్తారు.

సుజా : అవును. ఇన్నాళ్ళు మాకూ అతనికి నువ్వు అడ్డుగోడవైపోయావు.

చల : (లోనుండి వచ్చి గణపతి బ్యాగ్ అతని ముఖంమీద విసిరేశాడు) .... వాడితో యింకా మాటలేమిటమ్మా తన్ని తగిలెయ్యక.

సూర్య : (జుత్తు పట్టుకొని ఈడుస్తూ) పోరా పో... ఇక మా ఇంటి ఛాయలకు వచ్చేవో చంపి పాతరేస్తాను.

చల : ఊరికే వెళ్ళగొట్టడం కాదు... దొంగ వెధవ! ఏమైనా తీసుకుపోతున్నాడేమో కాస్తా చూస్తానుండు... జేబులో ఏమైనా దాచేవా! తియ్యి బయటకు

గణ : (జేబు మీద  చెయ్యి వేసుకొని) నేను తియ్యను.

చల : చూశావా నా ఊహ కరెక్టయ్యింది. ఏదో దాచేశాడు.

సుజా : చూడండి ఏంపట్టుకుపోతున్నాడో.

సూర్య : బయటకు తియ్యరా! (రెండు కొట్టాడు)

సుజా : ఇన్నాళ్ళు మా ఇంట్లో పడి తిన్నావు. యిప్పుడు దొంగతనం కూడానా?

చల : తియ్యరా దొంగవెధవా! (రెండు కొట్టాడు. ముగ్గురూ చుట్టుముట్టారు – అది చూశాడు జగన్నాథం)

జగ : రేయ్ వదలండిరా అతన్ని (బలాన్నంత కూడ గట్టుకొని వాళ్ళ మీద పడి అందర్నీ దూరంగా నెట్టేశాడు).... ఏవిటి గణపతి! ఏం జరిగింది?

గణ : నేనేదో దాచేశానంటున్నారు సార్! నేను దాచింది ఇదే సార్ (జేబులోంచి పిల్లల ఫోటో తీసి జగన్నాథం చేతిలో పెట్టాడు)

జగ : ఇదిగో చూడండి! అతను దాచింది ఇదే. చూడండి! పిల్లల్ని నా దగ్గరకు రాకుండా మీరు చేసినప్పుడల్లా దీన్ని నాకు చూపించి నన్ను ఓదార్చేవాడు – బాగా చూడండి! ఇది – నా మనవల ఫోటో... కాదు కాదు – మీ పిల్లల ఫోటో – చూడండి.

జగ : (ఫోటో ముందుపెట్టుకొని క్రింద కూర్చున్నాడు) పిల్లలూ! నా బుజ్జి పిల్లలూ! మీరు అమ్మనాన్ననీ వాళ్ళు నన్ను చూసినట్టు చూడకండేం – వాళ్ళను మీరు ఎంతో ప్రేమగా చూడాలి. గౌరవంగా చూడాలి. చూస్తారుగా!

గణ : సార్! కళ్ళముందు అన్నీ ఉండికూడా ఏదీ అనుభవించలేని అసమర్థస్థితి ముసలితనం అంటే! కమ్మని పిలుపుకోసం, కనికరమైన చూపుకోసం, ప్రేమనిండిన స్పర్శకోసం తహతహలాడిపోయే దశ ముసలితనమంటే! సడలిపోతున్న సత్తువతో అదుపుచెయ్యలేని చాపల్యంతో అన్నీ చేసెయ్యాలనుకొని ఏదీ చెయ్యలేని దయనీయమైన రెండో బాల్యం ముసలితనమంటే.... ఆ ముసలితనాన్ని ప్రేమించకపోయినా అసహ్యించుకోకూడదు సార్! మీరంటారే! కోతీ, ముసలి గబ్బిలమని – ఆ పనికిరాని కోతిని, ముసలి గబ్బిలాన్ని నాతోపాటు నేను తీసుకెళ్తాను ... రండిసార్ పోదాం.

జగ : ఒక్క నిమిషం గణపతీ! ఒరేయ్! పుట్టిన తర్వాత గిట్టక తప్పదు. అలాగే ముసలితనమన్నది కూడా ఎవరూ తప్పించుకోలేనిది. నువ్వూ... నువ్వూ... అందరు ఏదో ఒక రోజు వార్ధక్యపు వాకిట్లో అడుగుపెట్టాల్సిందే. అన్నీ మంచం మీద అయిపోతున్నా ఇంకా ఎందుకు బతకాలనుకొంటున్నానో తెల్సా! మీరు పెట్టే భోజనం కోసమో మీరిచ్చే బట్టలకోసమో కాదు – పిల్లల్ని చూస్తూ ఈ రొచ్చులోనే మరో వందేళ్ళయినా బ్రతకాలనిపిస్తోంది. వాళ్ళని నాకు పూర్తిగా దూరం చేశారు. కాబట్టి ఇక బ్రతకాలని ఆశ చచ్చిపోయింది. మనిషిని బ్రతికించేది శ్వాసకాదురా ఆశ! ఆ ఆశ ఆరిపోయింది... ఆ నాయనా! అమ్మా కోడలా! ఈ ముసలి గబ్బిలంలాంటి ఆకారాన్ని చూస్తే

మీకేకాదు! నామీద నాకూ అసహ్యమే! రొచ్చు కంపులో రోజులు తరబడి మగ్గిపోతున్న ముసలాళ్ళకు చావాలనిపించదు. ఎందుకో తెల్సా? నేను లేకపోతే ఈ లోకంలో నా పిల్లలు బ్రతకలేరనే భయం ఆ భయంతోనే ప్రతి ముసలి ప్రాణం కొట్టుకుంటుంది. పిల్లలకు తల్లితండ్రుల్లో ముసలితనం కనిపిస్తే పిల్లలు ఎంత పెద్దవాళ్ళైనా తలిదండ్రులకు ఎప్పటికీ పసితనమే కనిపిస్తుంది! ఇంట్లో ఎవరూ ఏ విలువ ఇవ్వకపోయినా ముసిలాళ్ళు గబ్బిలాళ్ళా వేళాడుతుంటారు. ఇంట్లో వారికి ఇష్టమున్నా లేకపోయినా వారు చేసేవన్నీ ముసలోళ్ళు గుడ్లగూబల్లా చూస్తుంటారు. ఎందుకో తెల్సా? ఎక్కడైనా తప్పటడుగు వేస్తే హెచ్చరించాలని. (ఆవేశం వచ్చి)... అంతేకానీ – ఇక్కడే వుండి – మీ ఆనందానికి అడ్డురావాలని కాదు – ఈ లోకాన్ని ఏలేద్దామని కాదు – (గుండె పట్టుకున్నాడు) పిలుపొచ్చింది. పిలుపొచ్చింది. (కొడుకుతో) గణపతి! (కాళ్ళమీద పడబోయాడు)

**గణ** : సార్! (వద్దని వారించాడు)

**జగ** : నా ఆత్మబంధువ్వి... నాకోసం నిన్ను ఆ భగవంతుడే పంపించాడు. నీ ఋణం.. (గణపతి కాళ్ళ మీదపడి ప్రక్కకు ఒరిగిపోయాడు)

**చల** : (ముక్కు మీద వేలేసి) పాపం చచ్చిపోయాడు.

**సూర్య** : నాన్నా! (అని భోరుమన్నాడు)

**సుజా** : (నోట్లో పైటచెంగు కుక్కుకొని ఏడుస్తోంది. గణపతి ఏడుస్తూ – ఓ పక్కకి వచ్చాడు)

**గణ** : అయిపోయింది! ఈ జీవన్నాటకంలో జగన్నాధం పాత్ర ముగిసిపోయింది – బ్రతికినన్నాళ్ళు తన వారి కోసం నానాయాతన పడిన ఓ మనిషి జీవనయానం పరిసమాప్తమైపోయింది. (భగవంతుని దివ్యతేజస్సు గోచరించింది – ఆ తేజస్సు నుండి భగవంతుని స్వరం వినిపిస్తోంది.)

**భగ** : గణపతీ! గణపతీ!

**గణ** : ఎవరది? ఎవరదీ?

**భగ** : నేను గజరాజా!

**గణ** : గజరాజా!...

**భగ** : నేనెవరో గుర్తుకురాలేదా?

**గణ** : (గుర్తు చేసుకొని) ప్రభూ! మనిషికి మీరిచ్చిన ఆయుష్షు, వరమో, శాపమో కళ్ళారా చూడమని మానవజన్మను ప్రసాదించిన జగత్కర్తలు మీరు. చూశాను

ప్రభూ... సమస్తమూ చూశాను. మీ శాపం నుండి మానవులు విముక్తులయ్యే మార్గమే లేదా ప్రభూ!

**భగ** : ఎందుకు లేదు గజరాజా! ఉంది - ఈ సృష్టిలోని సకల జీవరాశుల్ని సమభావంతో ఎవరు ప్రేమిస్తారో, ఈ విశ్వంలోని రహస్యాల్ని సాధించడానికి ఎవరు శోధిస్తారో, ఈ జగత్తులోని చిన్మయానందాన్ని ఎవరు అందరికీ అందిస్తారో, మాయామోహ తత్వాలతో కూడిన ఈ మహా మానవ జీవన్నాటకంలోని పాత్రల్ని, వాటి పరిధుల్ని ఎవరు గుర్తెరిగి ప్రవర్తిస్తారో, ప్రకృతి సూత్రాల్ని, సామాజిక ధర్మాల్ని, వ్యక్తిగత విలువల్ని ఎవరు కాపాడతారో వారు ఏ రంగంలో ఉన్నా, ఏ వృత్తి వ్యాపకాల్లో ఉన్నా వారెవరూ నా శాప ప్రభావానికి గురికారు. సర్వజనులు సుఖంగా, శాంతియుతంగా సమస్త మంగళకరంగా నియమబద్ధమైన జీవితాన్ని గడుపుతూ పూర్ణాయుష్కులుగా జీవించాలని దీవిస్తున్నాను.

**సర్వేజనా స్సుఖినోభవంతు**
**లోకాసమస్తా స్సుఖినోభవంతు**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**